అభ్యుదయ

మార్చి '78 వెల : 60 పైసలు



విశ్వవిఖ్యాత
జర్మన్
నాటకకర్త,
దర్శకుడు,
రచయిత
బెర్టోల్ట్ బ్రెఖ్ట్
80 వ
జన్మదినోత్సవం

అభ్యుదయ

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ పత్రిక

సంచిక : 3, సంపుటి : 2]   మార్చి - 1978   [సాలు చందా రూ. 7

పెద్ద నోట్ల రద్దు

ఊరికే కూర్చుంటే
ఊరంతా తిట్టిపారేస్తుందని
భయపడిన ప్రజా ప్రభుత్వం
ఉన్న పాటున
విన్నవించిందొక చిన్న సమాచారం!

ఫలితంగా
వేలూ పది వేలూ
మొహం చెల్లక మూలబడ్డాయి
ఒకటో రెండో పెద్ద తలలు
ఒయ్యారంగా కూలబడ్డాయి!
కడలి లాంటి
కాల ధనంలో
కాలవంతే ఇంకింది!
ఈ దేశపు దరిద్రాన్ని
పదిలంగా కాపాడే పెద్దమనుషులు
కళ్ళు మాత్రమే నలుపు కున్నారు
వళ్ళింకా విరుచుకోలేదు
మత్తంతా వదులుకో లేదు!
అయినా
పాముల్నే కాదన్న చిలుకపులి
చీమ కాట్లకు చస్తుందా?

టి. ప్రసన్నకుమార్

నాకు నచ్చిన (తెలుగు) రచన

ఆంధ్రదేశంలో ఒక ప్రాంతాన్ని పీనుగులమయం చేసిన మొన్నటి తుఫాను బీభత్సాన్ని వర్ణించిన ఒక కథను, ఫిబ్రవరి నెల 6న ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ ఆధ్వర్యాన జరిగిన గోష్ఠిలో యిద్దరు వ్యక్తులు 'నాకు నచ్చిన రచన'గా పేర్కొన్నారు. అది యిటీవల ఒక మాసపత్రికలో వచ్చిన "ఒక శనివారం రాత్రి" అన్నకథ. రచయిత శ్రీ ఎండమూరి వీరేంద్రనాథ్.

"వాస్తవాన్ని అతిసహజంగా చిత్రీకరించడమేగాక రచయిత ఈ ఘటన జరిగిన నాడు సర్వస్వం కోల్పోయిన కొన్ని వేలమంది మధ్య తానూ వున్నాననిపించేటంత వ్యథ కనిపింపచేశారు" అన్నారు శ్రీ ఉపద్రష్ట శాయి.

శ్రీ జి. సి. జీవి కథను చదివి వినిపించి, దాని ప్రాశస్త్యాన్ని వివరించారు.

చర్చా వేదిక

ఇరువురు వ్యాసకర్తలూ వరదలో కొట్టుకుపోతోన్న-కథలోని రాజయ్య తన భుజం మీద వున్న కూతురు బరువు మొయ్యలేక వదిలించుకొనేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు, ఆ చిన్నపిల్ల-"అన్నయ్య కన్న బరువు లేనుగా"అనడం ('బరువు తగ్గించుకోడానికి' అన్న అప్పటికే వరదపాలయ్యాడు) ఆ కథలోని కీలకం అన్నారు. కన్న సంతానాన్ని కూడా బలిచేసే బ్రతుకు తీపి ఆ ఘట్టంలో చాలా సూక్ష్మంగా, నిశితంగా చూపబడిందన్నారు. శ్రీ జీవి ఆ ఘట్టాన్ని కొంత కాలం క్రితం వచ్చిన శ్రీ కొండముది శ్రీ రామచంద్రమూర్తి "పాములాంటి బతుకు"లోని ఘట్టంతో పోల్చేరు.

చర్చలో పాల్గొంటూ, అతిక్లిష్ట పరిస్థితిలో మనిషి ఎలా వ్యవహరిస్తాడో చాల సహజంగా యీ కథలో చిత్రించబడిందన్నారు శ్రీ సి. సీతారాం. "శనివారం రాత్రి" కథలో సాధించిన ప్రయోజనం గాని, ప్రత్యేకతగాని లేదన్నారు శ్రీ ఈశ్వర్.

శ్రీ చామర్తి దుర్గాప్రసాద్ ప్రసంగిస్తూ, ప్రతిదానికీ ప్రయోజనం ఏమిటనడం అర్థరహితమన్నారు. మనిషి ఎంత అగాధానికి దిగజారుతాడో, ఈ కథ చెప్తుంది వాడు మనిషిలాగే ప్రవర్తించేడని చూపుతుంది. ఇదే దీనికి ప్లస్ పాయింట్. సామాజిక ప్రయోజనం వుంటేనేనా మంచి కథ అయ్యేది? క్లిష్ట సమయంలో మనుష్యుని ప్రవర్తన ఎల్లా వుండగలదో చూపడం సామాజిక ప్రయోజనం కాదా అని ప్రశ్నించారు.

శ్రీ సెట్టి ఈశ్వరరావు ప్రసంగిస్తూ ఉప్పెన వార్తలు చదివినప్పుడు కలిగినంతగా ఆవేదన ఈ కథ చదివినప్పుడు కలగడం లేదు; 'అభ్యుదయ'లో ఈ నెల "తుపానును జయించిన మనిషి" అనే వార్త వేశాం; అది కథ కాదు; పత్రికకోసం వ్రాసినదీ కాదు; అది ఒక వుత్తరంలో భాగం, ఆ ఘటన వలన పొందిన ఉద్వేగాన్ని లేఖకుడు చదువుతున్న వాళ్ళకి అందించిగలిగేరు; ఆ తీవ్రత ఈ కథలో తనకు కనిపించలేదన్నారు.

శ్రీ పసుపులేటి రామారావు కొద్ది కాలంక్రితం చదివిన 'ముత్యాల పందిరి' చాలా ఆకట్టుకొన్నదన్నారు. శ్రీ వీరంకి దక్షిణామూర్తి వ్రాసిన ఈ చిన్న నవలలో నేత పనివారి జీవితాలు, వారి ఆచారాలు, పద్ధతులు, ఆ వృత్తిలోని వారి అవస్థలు, సొసైటీ ప్రెసిడెంట్ల దోపిడి కళ్ళకు కట్టినట్లు చిత్రించేరు. దీనిలోని ముఖ్య సమస్య ఉన్నతనం, లేనితనం మధ్య నలిగిపోయిన ప్రేమ. ఈ రచన చదువరిచే కన్నీరు పెట్టిస్తుంది.

తరవాత శ్రీ శ్రీకాంత్ మహాకవి గురజాడ "దేశభక్తి గీతం" విశ్వకవి రవీంద్రనాధ్ టాగూరు "జనగణమన" గీతం కంటె, బంకించంద్ర ఛటర్జీ "వందే మాతరం" గీతం కంటె తమకు నచ్చినదనీ, గురజాడ గీతం జాతీయగీతంగానూ, అంతర్జాతీయ గీతంగానూ గానం చేయదగినదనీ చెప్పారు. (ఈ ప్రసంగం వేరే వ్యాసరూపంలో ఈ సంచికలోనే ఇవ్వబడుతూంది.)

జాతీయ గీతం, అంతర్జాతీయ గీతం వుండాలన్న భావనే తప్పు అవి. వాటిని ఒప్పుకున్నప్పుడు ఏ రాష్ట్రానికా రాష్ట్రం, చివరికి ఏ ప్రాంతానికా ప్రాంతం భక్తి గీతాన్ని పాడించే పరిస్థితికి దారితీయవచ్చుననీ శ్రీ దుర్గాప్రసాద్ అన్నారు.

ఉపమాన, ఉపమేయాలు మొదలయినవీ, అతిశయోక్తులు, తదితర ఆడంబరాలు గొప్ప కవిత్వంగా చదివి ఆనందించడానికి అలవాటు పడిన వాళ్ళు యీ గీతంలో కవిత్వం పాలు తక్కువగా వుందనడం వుంది. వేమనలాగే, గురజాడ కూడా భావబలానికి అధికృత యిచ్చిన కవి. అరవయ్యేదేళ్ళక్రితం కవితారీతిని, శైలినీ సమూలంగా మార్పు చేసిన కవి భాషలోనూ, భావంలోనూ, సాహిత్యానికి సంబంధించిన ప్రతి ఒక్కదానిలోనూ, వాస్తవికత, సాంఘిక ప్రయోజనం సూటిగా ప్రవేశపెట్టి రమణీయమైన పద్య గద్య రచనలు చేసిన గురజాడ సాహిత్యాస్వాదనకు కొత్త సంస్కారం కావాలి, పాత వాసనలు, పాత అభిరుచులూ పూర్తిగా వదలనిదే 'దేశభక్తి' గీతం వంటి దానిలోని నవ్య కవిత్వాంశం రుచించదు, అని శ్రీ సెట్టి ఈశ్వరరావు అన్నారు.

మట్టంగా వుంటేనేం? పల్లంగా వుంటేనేం? మనుషులుండేదే దేశమన్న ప్రాచీన తమిళ కవయిత్రి అవ్వయ్యార్ గీతాన్ని శ్రీ మది వాణన్ గుర్తుచేశారు.

దేశమంటే మనుషులన్న భావన సాహిత్యంలోనూ, సమాజంలోనూ గొప్ప ప్రభావం కలిగించిందని శ్రీ వి. చెంచయ్య అన్నారు.

కథానిక

మీసం

మల్లాది వెంకటకృష్ణమూర్తి

చలమేశ్వరరావు, నేను ఎలిమెంటరీ స్కూల్లో, ఒకే క్లాస్‌లో, ఒకే బెంచీమీద పక్కపక్కన కూర్చునే వాళ్ళం. వాడి కోరికలు, భావాలు నాకు కొట్టిన పిండే.

తర్వాత థర్డ్ ఫారం దాకా ఒకే స్కూల్లో చదివాం. వాడు నాకన్నా పొడుగు కాబట్టి వాణ్ణి వెనక బెంచీలోకి తోసేసారు అయినా మా స్నేహం ఆ స్కూల్లో వృద్ధవుతూ వచ్చింది.

మా ఇంగ్లీష్ టీచర్‌కి చక్కని మీసాలుండేవి. నల్లగా, గుబురుగా, నిగనిగలాడుతూ ఆయన ముఖానికి అవి ఎంతో అందాన్నిచ్చేవి. సినిమా హీరోలా సన్నగా ఫ్రెంచ్ కట్ మీసం కాదు. టూత్ బ్రష్ మీసం కాదు. హిట్లర్ మీసం కాదు.

తాండ్ర పాపారాయుడికున్నట్టు ఎంతో హుందాగా వుండేదా మీసం. చలమేశ్వరరావుకి ఆయన మీసాలంటే ఎంతో ఇష్టం. తను కూడా పెద్దయ్యాక అలాంటి మీసాలు పెంచాలని కలలు కనేవాడు.

ఫోర్త్‌ఫారంలో నేను కాంపోజిట్, వాడు జనరల్ మేథ్స్ తీసుకోవటంతో ఇద్దరం విడిపోయాం. అయినా స్కూల్‌కి కలిసి వెళ్ళేవాళ్ళం, కలిసి వచ్చేవాళ్ళం. మా సెక్షన్లు వేరయినాయి.

మా నాన్నగారికి బదిలీ అవటంతో నేను కాకినాడ వదిలి హైదరాబాద్ వచ్చేసాను. ఆ తర్వాత చాలా వూళ్ళు తిరిగాం.

మళ్ళీ పదేళ్ళ తర్వాత కాకినాడ వెళ్ళాను. చలమేశ్వరరావు సంగతి పూర్తిగా మర్చిపోయాను. వాళ్ళు ఇంకా అదే ఇంట్లో వుంటున్నారు. మా ఇంటి ప్రక్కనే అది.

చలమేశ్వరరావు నన్ను చూసి, గుర్తుపట్టి, పలకరించాడు. అరగంటసేపు మాట్లాడుకొన్నాం వివిధ విషయాలు.

అప్పుడు గుర్తొచ్చింది నాకు చలమేశ్వరరావు మీసాల కోరిక. శుభ్రంగా షేవ్ చేసేసుకొన్నాడు గడ్డం, మీసం.

కారణం అడిగాను.

"ఏం లేదు" అని నవ్వి వూరుకున్నాడు.

మర్నాడు తెలిసింది. చలమేశ్వరరావు షేవ్ చేసుకోకపోవటం వల్ల. చిన్నతనంలోనే వాడికి అనేక ఎదురుదెబ్బలు తగిలాయి. తండ్రి పోయాడు, తల్లి పిచ్చిదైంది. భార్య పెళ్ళయిన రెండు నెలలకే వదిలేసింది. జీతం చాలే వుద్యోగం కాదు.

ఫలితంగా గడ్డం, మీసం ముసలివాని లాగా బాగా నెరసిపోయాయి.

కొలబద్దలు

అతి సామాన్య సూత్రాలు, నా కొలబద్దలు. జీవితాన్ని పెంచేది శారీరక, మానసికారోగ్యానికి సాయపడేదంతా మంచిది. జీవితాన్ని హ్రస్వ పరచేది, బాధించేది, కృంగదీసేది వికృతం చేసేదంతా చెడ్డ.

జాక్ లండన్

అంతర్జాతీయ గీతం కాదగిన గురజాడ దేశభక్తి గీతం

శ్రీకాంత్

(ఫిబ్రవరి నెల గోష్టిలో చదివిన ప్రసంగ వ్యాసం)

ఒకరి గొప్పతనాన్ని అంగీకరించడం తెలుగువాడి స్వభావానికే విరుద్ధం. అందునా ఒక తెలుగువాడి గొప్పతనాన్ని మరో తెలుగువాడు అంగీకరించడమా? అందుకే అన్ని భాషల వారికీ జాతీయ కవులు, మళయాళీలకు వల్లథోల్, తమిళులకు సుబ్రహ్మణ్య భారతి, బెంగాలీ వారికి రవీంద్రనాథ టాగూర్ వున్నారు గానీ మన తెలుగులో మాత్రం ఒక్కడంటే ఒక్కడు గూడా జాతీయ కవి లేడు గాక లేడు! జాతి వైతాళికుడైన వీరేశలింగం కూడా ఆధునికుడు గాకపోగా థర్డ్ రేట్ రైటర్ కొందరి దృష్టిలో అయినప్పుడు గురజాడెంత? ఆయన దేశభక్తి గీతం విలువెంత? అందుకే ఆయనను 'అకవి' అని అపహాస్యం చేశాము. అయినా ఆయన చెప్పిందేముంది? "దేశమంటే మట్టి కాదోయ్! దేశమంటే మనుషులోయ్" అని ఒక స్టేట్‌మెంట్ పారేస్తే అది కవిత్వమవుతుందా? అందులో కవిత్వముందా? కాకరకాయుందా? మనకూ, మన వేదాంతులకూ దేశమంటే మట్టే. ఇక మన కవి వృషభులకు పవిత్ర భూమి, పావన గంగ జలాలు, గగన చుంబిత ధవళ శిఖరాలు మాత్రమే దేశం. వీరందరి దృష్టిలో మనుషులంటే సామాన్యుడి నెత్తి నెక్కి స్వారీ చేసే రాజులు. అందుకే వారిని విష్ణ్వంశ సంభూతులుగా కొనియాడారు.

మన జాతీయ గీతాలుగా చెప్పుకుంటున్న రెండు గీతాలు, 'జనగణమన' 'వందేమాతరం' ఈ రెండూ మట్టినే స్తుతించాయి. 'పంజాబు, సింధు, గుజరాత, మరాఠా' లుగా విడిపోయిన భారత భూమిని, 'ఉచ్ఛల జలధి తరంగాలు' అయిన గంగా, జమునలను మాత్రమే దర్శించి ఈ నేల, ఈ నీళ్ళ నుండి ఆశీస్సులు, శుభములు మాత్రమే కోరాడు గానీ ప్రజాక్షేమం గురించి ప్రస్తావించలేదు రవీంద్ర తన గీతంలో. గురజాడ "దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్" అంటూ నొక్కి వక్కాణించి మనుషుల్ని గుర్తు చేశాడు.

అలాగే బంకించంద్రుని 'వందేమాతరం' లోను సుజలాలను, సుఫలాలను, పుల్లకుసుమిత ద్రుమదళ శోభలను, శుభ్ర జ్యోత్స్న పులకిత యామినులను మాత్రమే వర్ణించాడు గాని మనుషులను మాత్రం కాదు.

గురజాడ తన గేయంలో ఆంధ్ర దేశాన్నే గాదు, భారత దేశాన్ని గూడా గొప్పగా కీర్తించలేదు 'లేదురా యిటువంటి భూదేవి యెందు. లేరురా మన వంటి ధీరు లింకెందు' అంటే, అది ఒట్టి ఆత్మస్తుతి మాత్రమే అవుతుంది. భారతదేశాన్ని ప్రపంచ పటం నుండి వేరుగా, ఆంధ్ర దేశాన్ని భారతదేశ పటం నుంచి వేరుగా చూసే వారు మాత్రమే ఇలాంటి మాటలు రాయగలరు. ఆంధ్ర దేశ మంత గొప్ప దేశంలేదని, శాతవాహనులు ఇక్ష్వాకులు, ప్రపంచాన్నంతా పరిపాలించారని రాసిన మన చరిత్రకారు లున్నారు. భారతదేశంతో పోల్చి యితర దేశాలను కించ పరుస్తున్నాము. భారతదేశ పటంలో ఆంధ్ర దేశంతో పోల్చి మిగతా రాష్ట్రా లను చులకనగా చూస్తున్నాము. ఒకే ఆంధ్ర రాష్ట్రంలో ఎంత దగ్గరగా గిరి గీసు కుంటే, పదవుల సంఖ్య అంతగా పెరుగుతుంది గదాని అరాచకాల సృష్టికి బీజావాపన చేస్తున్నాం.

ఒక్క గురజాడ మాత్రమే రాష్ట్రాలకు, దేశాలకు అతీతమైన దేశభక్తి గానం చేశాడు. 'దేశమును ప్రేమించు' మన్నాడు. కానీ 'పొగడు' మనలేదు. నీవు ప్రేమించ లేని దేశాన్ని పొగిడితే ఒరిగే దేమిటి?

గురజాడకు దేశం ఒక దొడ్డ వృక్షంలా కనిపించింది. విశాలాకాశంలోకి శాఖోప శాఖలుగా విస్తరించిన యెంత దొడ్డ వృక్షానికైనా శరీరం ఒకటే దాని వేళ్లు బలంగా నేలలోకి చొచ్చుకుపోయి తన శరీరంలోని ప్రతి అణువుకూ అవసరమైన జీవ పదార్థాన్ని అందిస్తాయి.

ఏ దేశంలోనైనా ప్రజల ఆహార, విహారాల్లో, సంస్కృతీ, సభ్యతలలో, ఆచార వ్యవహారాలలో వైవిధ్యాలు, భిన్నత్వాలు సహజం. ఇంత భిన్నత్వం గల సంస్కృతిలోనే ప్రపంచ ప్రజ లందరినీ ఏకం చేసే ఒక బంధం వున్నది. అదే 'ప్రేమ'. విశ్వమానవ ప్రేమ. కొందరికి ఈ విశ్వ మానవ ప్రేమ, అంతర్జాతీయ వాద మంటే గిట్టకపోవచ్చు. మరి కొందరికి ఏదో మహా భూతంలా కనిపించవచ్చు. 'ఉన్ని నా బొజ్జకు శ్రీరామ రక్ష' అనుకునే వారి పగటి కలలుగా కనిపించవచ్చు. కానీ ఏ ఆదర్శమూ, ఆశయమూ లేకుండా ఒంటి పిల్లి రాకాసిగా బ్రతకడంకన్నా ఈ పగటి కలల్లో బ్రతకడమే మిన్న.

ఎన్ని శాఖోప శాఖలుగా విస్తరించిన మహా వృక్షమైనా ప్రతి కొమ్మన, రెమ్మన ఒకే మారాకు వేస్తుంది. ఒకే పూలు పూస్తుంది. ఒకే ఫలాలు అందిస్తుంది. తనలోని సమస్త భాగాలకు సక్రమంగా జీవశక్తి అందేలా చూసుకుంటుంది ఆ మహా వృక్షం. దాని నిర్మాణం అంత సహజంగా, అంత సౌష్టవంగా వున్నప్పుడే అది దొడ్డ వృక్ష మవుతుంది. అలాగే దేశంలోని [అది యే దేశమైనా కావచ్చు] ప్రజ లందరూ ఒకే నేల మీద పుట్టారు. ఒకే ఆకాశం క్రింద జీవిస్తున్నారు. మరి వీరిలో తరతమా లెందుకు? వారందరిలోనూ ప్రేమ సుమాలే సుమించాలి.

'నరుల చెమటను తడిసి మూలం ధనం పంటలు పండవలె నోయ్' అంటారు గురజాడ. ఈ దేశమనియెడి దొడ్డ వృక్షం మూలానికి ప్రాణం నరుల చెమటలు. గంగలు, గోదావరులూ కావు. నరుల కష్టం, నరుల శ్రమ, నరుల చెమట లేని నాడు, 'వొట్టి గొప్పలు చెప్పుకొని' మురిసిన నాడు. 'చెట్ట పట్టాల్ పట్టుకొని దేశస్థులంతా' నడవని నాడు ఈ పవిత్ర గంగా నదులు, గోదావరి వాఃపూరములు వుత్తినే నీళ్ళు కారిపోతాయి. ప్రజావాహిని ఒక్కటే ఇంకిపోనిదీ, సజీవమైనదీను. దేశానికి పెట్టని కోటగోడ హిమాలయం కాదు. ప్రజా బలం. ఈ సత్యాన్ని గానం చేసిన జాతీయ కవి ఒకే ఒక్క గురజాడ.

'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని నీరసపడి పోనవసరం లేదు. మంచి గతమున కొంచెమే నోయ్, మందగించక ముందు అడుగేయ్' అని కొండంత ధైర్య మిచ్చి, వెన్నెలట్టి వైతాళిక గీతం ఆలాపిస్తున్నాడు గురజాడ. అందుకే గురజాడ పాడిన ఈ పాట వినిపించుకోకుండా 'వెనుక చూచిన కార్యమే మోయ్' అని ఆయన మందలించినా, మనం అడ్డగాళ్ళ పీతల్లా, వెన్నపూసలేని నత్తల్లా వెనుక పడుతూనే వున్నాం. వెనుకనే వుంటున్నాం.

ఈ గీతంలో సాంప్రదాయకమైన కవితా వైభవాన్ని వెతికి వేసార నక్కర లేదు వేమనలాగే గురజాడ యిందుకు తాపత్రయ పడలేదు. ఆయన 'ఆకు లందున అణిగి, మణిగి, కోకిల' వలె పలికాడు. ఆ 'పలుకులను విని దేశ మందభిమానాలు మొలకెత్త వలె' నని ఆశించాడు కానీ, ఆ కోకిల పలుకులోని పంచమ స్వరాన్ని ప్రశంసించాలని ఆశించలేదు.

దేశభక్తి గీతం ఒక్కటి చాలు గురజాడను మహా కవి అనడానికి.

'ఎల్ల లోకము లొక్క యిల్లై, జాతిభేదము లెల్ల కల్లై' గురజాడ నాడే కలగన్న వసుధైక ప్రభుత్వం యేర్పడితే, ఆ ప్రభుత్వానికి జాతీయ, అంతర్జాతీయ గీతంగా వుండదగిన అర్హత ఒక్క 'దేశభక్తి' గీతానికి మాత్రమే వుంది ఆ అర్హత ఆ గీతంలోని విస్తృతిని, ఆ గీతంలోని విశ్వ మానవ దృష్టిని, ఆ గీతంలోని మానవతా దృక్పథం, ఆ గీతంలోని ఆచరణ సాధ్యమైన ప్రబోధం, ఆ గీతంలోని సార్వజనీనత వల్ల లభించిందే తప్ప ఆ గీతంలోని కవిత్వం, రసం, గీతాన్ని గానం చేయడం, ఒట్టి గొప్పలు చెప్పుకోవడం వల్ల వచ్చింది మాత్రం కాదు.

కాలం గడుస్తున్న కొద్దీ బలం సంతరించుకొనే కొద్దిపాటి మహాకావ్యాలతో ఒకటిగా దీనిని (దేశభక్తి గీతాన్ని) గుర్తించక తప్పదు. ఒక తెలుగు కవి ప్రపంచానికిచ్చిన కవిత్వపు కానుక యిది.

"బాబ్బాబు. మీ మేలు మరవను, నా చర్మంతో తమకు చెప్పులు కుట్టించిస్తాను."

"ఒద్దొద్దు, దానికన్నా ఏ గొడ్డు చర్మమైనా నయం."

దురంతకుడి గూటి కదలెయ్యడం అన్నది, సమస్యలను మరీ తేలిక పరిష్కార మార్గ మవుతుంది.

జార్జి బెర్నార్డ్ షా

సంస్కారం

కథానిక

డాక్టర్ ఎ. విజయలక్ష్మి

పాట్నా జంక్షన్ నంబర్ వన్ ప్లాట్ ఫామ్ మీద నుంచున్న భారతి వాచ్ వంక విసుగ్గా చూచింది. ట్రెయిన్ దానాపూర్ స్టేషన్ దాటేసిందని యిందాకే చెప్పాడు ఎంక్వయిరీ మహానుభావుడు, యింత వరకు అజా, పజా లేదు. మధ్య పుల్వారీ స్టేషన్‌లో పడకోలేదుకదా!

"హలో! భారతి గారూ!" తెలుగు కంఠం వినిపించే సరికి ప్రాణం లేచి వచ్చినట్లయి సంతోషంగా అతనివంక చూచింది భారతి.

"హలో" భారతి విష్ చేస్తూ వుండగానే, ఆమె ఎదురుచూస్తున్న ట్రెయిన్ వచ్చింది.

"ఓ ఫ్రెండ్‌కి సెండాఫ్ యివ్వడానికొచ్చాను. మీరిలా వచ్చారేంటి? మీ వారు గాని వస్తున్నారా?" చనువుగా, ఆప్యాయంగా, హద్దులు మీరకుండా మాట్లాడే ప్రసాదరావంటే ఎంతో యిష్టం భారతికి. ఎప్పుడైనా అతను కనిపించి మాట్లాడితే ఆత్మబంధువును చూచినట్లుంటుంది.

"అబ్బే లేదండి తనకు లీవ్ దొరకదిప్పుడు" భర్త ప్రసక్తి రాగానే భారతి హృదయంలో చిన్న కెరటం లేచి చెక్కిళ్ళు కందాయి. భారతి చెప్తూ వుండగానే, వేగంతగ్గి ఆగబోతున్న ట్రెయిన్ లోంచి ఒకతను భారతినిచూచి నవ్వుతూ చెయ్యూపాడు.

అతన్ని చూడగానే భారతి ముఖం కళ కళలాడి పోయింది. ట్రెయిన్ ఆగగానే ఒక్క అంగలో ప్లాట్‌ఫామ్ మీదికి దూకాడతను. ప్రసాదరావు ఉనికిని మరిచిపోయినట్లుగా భారతి వడివడిగా సారధివైపు నడిచింది.

"భారతీ!" సంభ్రమంగా భారతి వంక చూస్తూ వుండిపోయాడతను.

"నీ కోసం ఎన్ని యుగాల నుంచి యీ చలిలో వెయిట్ చేస్తున్నానో తెలుసా?"

ఆప్యాయంగా సారధివంక చూచింది భారతి.

"రియల్లీ....?! ఎంత అదృష్టవంతుడిన్నేను!!" మెరుస్తున్న కళ్ళతో భారతి వంక చూశాడు సారధి.

"అన్యాయం భారతి గారూ!" ఉలిక్కిపడి ప్రసాదరావు వైపు తిరిగింది భారతి.

"అయామ్ సారీ! ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ ప్రసాద్‌గారూ! సారధీ! వీరు పాట్నా యూనివర్శిటీ ఇంగ్లీషుడిపార్ట్‌మెంట్‌లో పి హెచ్. డి. చేస్తున్నారు. ప్రసాద్ గారూ! ఇతను నా ఫ్రెండ్ సారధి. బెంగుళూరులో పనిచేస్తున్నాడు. ఢిల్లీలో ఏదో పనుండి వచ్చి, దగ్గర్లోకి వచ్చాను కదా అని నన్ను చూడడానికి వచ్చాడు"

"యీమె డాక్టర్ భారతి అని నా ఫ్రెండ్ ప్రసాద్‌గారూ! ప్రిన్స్‌వేల్స్ మెడికల్ కాలేజిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్" చిలిపిగా భారతి వంక

చూసాడు సారథి. 'యితను నా ఫ్రెండ్' అని ధైర్యంగా చెప్తున్న భారతి వంక ఒక క్షణం ఆశ్చర్యంగా చూచి మళ్ళీ మామూలుగా అయిపోయాడు ప్రసాద్.

కాసేపు స్టేషన్‌లోనే నుంచుని కబుర్లు చెప్పుకుని బయటి కొచ్చేప్పటికి, పాట్నా నగరాన్ని కౌగిలించుకున్న భయంకరమైన చలి చెంపలకు తాకింది.

"ప్రసాద్‌గారూ! యిక్కడ భారతి హాస్టల్‌కి దగ్గర్లో మంచి హోటలేదైనా వుందా?"

"అదేంటండీ? భలేవారు. హోటల్లో వుండడమేంటి? భారతిగారి హాస్టల్‌కి దగ్గర్లోనే కదమ్‌క్వాన్‌లో వుంది మా రూమ్. మా రూమ్‌కి వెళ్దాం. ప్రసాద్ హడావిడికి ఒక ప్రక్క సంతోషంగా వున్నా, యీ చలిరాత్రిలో మరో ఒరియా స్టూడెంట్‌తో ఆ జానెడు గదిలో కలిసి వుంటున్న అతన్ని యిబ్బంది పెట్టడమిష్టం లేకపోయింది భారతికి.

"ఎందుకు? ఒద్దండి. సారథి హోటల్లో వుంటాడు" గబ గబ అనేసింది భారతి.

"అదేం కుదరదు. నేను కలవకపోతే అది వేరే సంగతి. కలిసాక అతిథి మర్యాద చెయ్యకుండా వదుల్తాననుకున్నారా?" చనువుగా సారథి చేతిలో సూట్ కేస్ తీసుకుని రిక్షా ఎక్కి కూర్చున్నాడు ప్రసాద్.

"రండి సారథిగారూ! గుడ్‌నైట్ భారతిగారూ!" ఇంకో రిక్షా వాడిని పిలిచి మేమ్ సాబ్‌ని మెడికల్ కాలేజి హాస్టల్‌కి తీసుకువెళ్ళమని పురమాయించి దాదాపు బలవంతంగా సారథిని తన రిక్షాలో కూర్చోబెట్టుకుని వెళ్ళిపోయాడు ప్రసాద్.

ఇది వేషం—మోసం!

ఆవు మనిషై పోయింది
పెయ్య నాగలై పోయింది
శంఖంలో పోస్తే పైపు నీళ్ళు
తీర్థమైపోయింది
జనంలో కలిసి తాలు తప్ప
ధాన్యమైపోయింది
అవినీతి నష్టేట్లో మునిగి
అవతారం మార్చింది
నిన్నటి ఈ దౌర్భాగ్యుడు
నేతగా నీతులు చెపుతున్నాడేం చెప్మా!
ఉచ్చాలకు స్వచ్ఛంద మరణం లేదు
కాబోలు!
అయ్యో, ఈ దరిద్రుడు
పవిత్రుడు కాడు, పరమ కిరాతకుడు
ఈ సన్యాసి వేషం మొన్నటి
దసరా పండుగ నాటిది!
ఈ వాసన రాత్రి సారా కొట్టు నివాసఫలం
ఈ సూక్తులు నా యింట్లో
పుస్తకం లోనివి
ఈ టోపీ వాడి తాతయ్య పారవేసుకుంది
నయవంచకుడు-నమ్మకండి
వీడు దొంగ-గారడీ వాడు
గజనీ, గోరీల వారసుడు-ఆస్తితో
కుళ్ళిపోయిన
అజీర్ణ రోగగ్రస్తుడు
అది బలుపు కాదు వాపు
అది తెలుపు కాదు పాలిన రూపు!
నక్కను నాయకుణ్ణి చేయకండి
మిత్రభేదం కథ మరిచిపోకండి!

చందు సుబ్బారావు

"భలే వాడు" అనుకుంటూ రిక్షా ఎక్కింది భారతి. తమకు ఇబ్బంది అయినా తన ఫ్రెండ్‌ని అంత ఆప్యాయంగా ప్రసాద్ తీసుకెళ్తుంటే భారతి హృదయం ఆనందంతో కృతజ్ఞతతో పొంగిపోయింది.

మరునాడు సాయంత్రందాకా సారథితో కలిసి పాట్నా నగరంలో చూడాల్సిన ప్రదేశాలన్నీ చూస్తూ కబుర్లు చెప్పుకున్నా అతను వెళ్ళిపోతుంటే తనను తాను నిగ్రహించుకోలేక పోయింది భారతి. క్రమక్రమంగా ట్రెయిన్ కనుమరుగవుతుంటే కళ్ళు సన్నటి పొర కప్పినట్లయి మసకబారాయి. ప్రసాద్ భారతి వంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"భారతిగారూ!" ఉలిక్కిపడి కళ్ళల్లోని చెమ్మని దాచుకుంటానికి ప్రయత్నిస్తూ ప్రసాద్ చూపుల్ని తప్పించుకుంది భారతి.

"రండి అలా నడుచుకుంటూ వెళ్ళి భారత్ కేఫ్‌లో వేడివేడి దోసె ఇడ్లీ, సాంబార్ తినేసి వెళ్దాం" అతని వంక కృతజ్ఞతగా చూచింది భారతి. కాని అతని వెంటవెళ్ళి తినడానికి మొహమాట పడింది.

"ఒద్దు యిప్పుడేం తినాలని లేదు. హాస్టల్‌కి వెళ్ళిపోతాను."

"అలాఅంటే ఒదుల్తాననుకున్నారా? అదేం కుదరదు, పదండి, పదండి. ఒద్దనుకుంటూనే ఖచ్చితంగా ఒద్దని చెప్పలేక అతని వెంట నడిచింది భారతి.

"భారతి గారూ! సారథిగారు మీకు బాగా క్లోజ్ ఫ్రెండనుకుంటాను." నిరుత్సాహంగా, అన్యమనస్కంగా చేతిలోని టీగ్లాసు వంక చూస్తున్న భారతిని అడిగాడు ప్రసాద్.

"అవును. అందులోనూ చాలారోజుల తరువాత కలిసాడేమో, అప్పుడే వెళ్ళిపోయాడంటే ఎందుకో కంట్రోల్ చేసుకోలేక పోతున్నాను" ఇడ్లీ ప్లేటు దగ్గరకు తీసుకుంటూ జవాబిచ్చింది. భారతి. మధ్యమధ్యలో ఏవో ఒకటి రెండు మాటలు మాట్లాడినా దాదాపు మౌనంగా టిఫిన్ తినడం ముగించింది భారతి.

"యింత వెళ్తాన్నను యిక్కడదాక తీసుకొచ్చి టిఫిన్ పెట్టించినందుకు చాలా థాంక్స్" అంది భారతిచిన్నగానవ్వుతూ. రిక్షాకోసం చూస్తున్న భారతి వంక సీరియస్‌గా చూస్తూ వుండిపోయాడు ప్రసాద్,

"సారీ భారతీ, రాత్రి సారథిగార్ని నా రూమ్‌కి తీసుకు వెళ్ళడం మూలాన మీరు ఏకాంతంగా వుండడాని కవకాశం లేకుండా చేసానేమో కదూ?" అతనలా సడెన్‌గా అడిగేసరికి చివ్వున అతని వైపుకు తిరిగింది.

"ఏమిటి మీరనేది?" విస్మయంగా ప్రసాద్ వంక చూచింది భారతి.

"సారథి వున్న ఒక రాత్రిని మీకు కాకుండా చేసానే అని" ప్రసాద్ చూపులో మార్పు. అతని మాటల్లోని శ్లేష గుర్తించి తృళ్ళిపడింది భారతి.

"వాడ్డూ యూమీన్?" కంఠం కరుకుగా వున్నా భారతి ముఖం పాలిపోయింది. కాని అతనిలో నిద్రలేస్తున్న రాక్షసుడికి వివేకం, జాలిరెండూ లేకుండాపోయాయి. అతని హృదయానికి, మెదడికినోటికిమధ్య

ఉన్న కనెక్షన్స్ తెగిపోయి నోరు యిష్టం వచ్చినట్లు స్వతంత్రంగా మాట్లాడేసింది.

"ఈ రాత్రికి నన్ను సారధి అనుకోకూడదూ!" ఆకాశం విరిగి తన మీద పడితే బావుండు! భూమి రెండుగా చీలి తనని దాచుకుంటే బావుండు ననిపించింది భారతికి. తను ఎంతో సహృదయుడు స్నేహపాత్రుడూ అని నమ్మిన వ్యక్తి యితను. ఆడ, మగ కలిసి నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూంటే చూచి చూడనట్లు ఊరుకునేంత వరకే ఎదిగింది సమాజం. ఆడ, మగ స్నేహం తాలూకు గాఢానుభూతుల్ని పంచుకుంటూంటే అవి శరీర సంబంధాలకు అతీతంగా వుండగలవని నమ్మేంతవరకీ సమాజం ఎదగలేదని తనకు తెలుసు కాని మామూలు సమాజం కంటె ఉన్నతుడిగా కన్పిస్తున్న యితను కూడా తమ బాంధవ్యాన్ని సమాజపు చత్వారపు కళ్ళతోనే చూశాడే! తనను ఎంత హీనంగా అంచనా వెయ్యక పోతే యింత జుగుప్సాకరంగా మాట్లాడ గలుగుతాడు!

"భారతీ!" ప్రసాద్ చెయ్యి తన భుజం మీద పడగానే అంత చలిలోనూ తన శరీరాన్ని బాయిలర్‌లో పడేసినట్లు ఫీలయింది భారతి.

"ప్రసాద్ గారూ! యింకా మీ సంస్కారం మీద పూర్తిగా నమ్మకం పోలేదు నాకు స్నేహమనేది శరీరసంబంధాలకుమించిన అనుబంధమని నమ్మగలిగిన రోజున మళ్ళీ నన్ను పలకరించండి" తన చేతిని పురుగును విదిలించేసినట్లు విదిలించేసి వడివడిగా వెళ్ళిపోతున్న భారతిలో ఆధునిక స్త్రీలోని ఒక కొత్త కోణాన్ని దర్శించ గలిగాడు ప్రసాద్.

Statement about ownership and other particulars about ABHYUDAYA, LITERARY MONTHLY, MADRAS.

FORM IV (See Rule 8)

1.	Place of publication	:	Madras
2.	Periodicity of its publication	:	Monthly
3.	Printer's Name (Whether citizen of India ?) (If foreigner, State the country of origin) Address		Sri V. V. Subbarao Indian Madras-600 021
4.	Publisher's Name (Whether citizen of India ?) (If foreigner, state the country of origin) Address	:	Sri T. Venkataramayya Indian 15, Arulamal Street, Madras-600 017
5.	Editor's Name (Whether citizen of Iddia ?) (If foreigner, state the country of origin) Address	:	Sri T. Venkataramayya Indian 15, Arulammal Street, Madras-600 017
6.	Names and addresses of individuals who own the newspaper and partners or share holders holding more than one percent of tue total capital.	:	Andhra Pradesh progressive Writer's Association, Madras Branch, 15, Arulammal Street, Madras-600 017

I, T. Venkataramayya, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 1-3-1978

(Sd.) T. VENKATARAMAYYA,
Publisher.

కథానిక

సీతా చటర్జీ

మహీధర రామశాస్త్రి

"సీతా! నా చదువయిపోయింది. ఇక మన వివాహానికి, అభ్యంతరం ఉండదు!"

"సరే. అయితే!"

"కాని, మనం కొన్ని విషయాలు మాట్లాడుకోవాలి!"

"నేనేం మాట్లాడేది లేదు ! నువ్వే గయినా చెప్పాల్సింది ఉంటే చెప్పు!"

"మనం పెళ్ళి చేసుకున్నాక, నువ్వు బయట ప్రోగ్రాములు ఇవ్వడం మాను"

"రేడియో లో కూడానా?"

"రేడియో లో ఫర్వాలేదు!"

"నే నెందుకు ప్రోగ్రామ్సు ఇవ్వాల్సి వస్తుందో నీకు తెలుసా?"

"బహుశా! డబ్బుకోసం కావచ్చు!"

"కాదు. నువ్వే కారణం!"

"నేనా?"

"అవును. మా తాత నిన్నుదత్తు చేసుకోకపోతే, ఆ ఆస్థికి వారసురాలు మా అమ్మ! నిన్ను దత్తు చేసుకుని, మా పరిస్థితిని ఇలా చేసేడు మా తాత. మా అమ్మ అన్నీ వుండీ ఏమీ లేనిదయింది. నాన్న రిటైరయారు. నేను గౌరవప్రదంగా ఇంటిని ఆదుకుందుకు, వీణ డిప్లమాతో ప్రోగ్రామ్సుకోసం తంటాలు పడాల్సి వస్తుంది."

"మన పెళ్ళి తరువాత నీకా అవసరం ఉండదు!"

"నాతోపాటు, వాళ్ళనీ పోషిస్తావా?"

"అదెలా కుదురుతుంది?"

"అయితే వాళ్ళకోసం నేను ప్రోగ్రామ్సు ఇవ్వక తప్పదు!"

"నీకు సంబంధం ఏమిటి? పెళ్ళయిన ఆడపిల్ల తల్లి దండ్రులని పోషిస్తుందా?"

"ఉహూ! ఇంకా ఏమయినా షరతు లున్నాయా?"

"మీ నాన్న పెళ్ళి మన పెళ్లి సంగతి మా నాన్నకి చెప్పాలి!"

"మీ నాన్న అంగీకరించక పోతే చేసుకోవా? అయినా మీ నాన్న ఎవరు?"

"ఎందుకు చేసుకోను?"

"అలా చెప్పడం మా నాన్న కిష్టం లేకపోతే, మీ నాన్న ఎందుకు చెప్పకూడదు, మా నాన్నతో?"

"అది సాంప్రదాయం!"

"అర్థంలేని సాంప్రదాయం".

"మన పెళ్ళికి ఆ మాత్రం చేయలేడా మీ నాన్న?"

"అతనికి ఇష్టంలేని పనిని మనం ఎందుకు చేయించాలి?"

"అది అతని బాధ్యత కనుక!"

"ఓకే! మావయ్యా! నీకే తెలివితేట లున్నట్లు మాట్లాడకు! అయినా, పెళ్ళి అవకుండానే ఇన్ని ఆంక్షలు పెడుతున్నవాడివి, పెళ్ళయాక మరెన్ని షరతులు పెడతావో? నీతో నాకు పెళ్ళేమిటి?

"అంతేనా నీ నిర్ణయం?"

"అంతే!"

0 0 0

ఫోను మోగుతుంది. ఫోనులో లతా రామశర్మ.

"హలో! లతా! హౌ ఆర్ యూ?"

"నాట్ బాడ్, థాంక్యూ!"

"హైదరాబాదు నుంచి ఎప్పు డొచ్చావు?"

"నిన్న బాగా పైరయిపోయాను. శర్మా! నీకో న్యూస్ - నాకు ప్రమోషన్ మీద హెడ్డాఫీసుక్కి ట్రాన్స్ఫర్ అవుతుంది."

"వెరీగుడ్! కంగ్రాచ్యులేషన్స్!"

"నీకు ఆనందంగా ఉందా?"

"నీకు మాత్రం ఆనందం కాదా ప్రొమోషనొస్తే?

ప్రయివేట్ శక్రటరీ టు మేనేజింగ్ డైరెక్టర్!

"వాటే కవొంటెడ్ పోస్టు ఇన్ డీడ్!"

"ఇటీజ్ ఓ కె! కాని .... ఇన్నాళ్ళ నుంచి ఉంటున్న ఈ వూరినీ, నిన్నూ వదిలి వెళ్లాలంటే నాకు బాధగ ఉంది. కాంట్, బట్ బౌండ్ టు ..."

"వై డోంట్యూ రిజైన్?"

"ఫామిలీ మాట· అమ్మ తమ్ముడు నా మీద పూర్తిగ ఆధారపడ్డవాళ్లు! వాళ్ళకోసం, కనీసం తమ్ముడి చదువయ్యే దాక, ఈ వలయంనుంచి, బయటపడ లేను. ఆ సంగతి నీకు తెలుసు! .... ఓ మాట అడగనా?"

"అడుగు!"

"ఒబ్లైజ్ చేస్తావా?"

"ఇఫ్ పాసిబుల్!"

"మనం పెళ్ళి చేసుకుందాం!"

"మనవాం? పెళ్లా? (నవ్వేస్తాడు) అది సరే — ఎప్పుడు వెళ్ళడం?"

"ఇనెదె అర్ టూ!"

"సో సూన్! ఐ వాంట్ టూ మీట్ యూ!"

"సాయంత్రం యింటికి రా!"

"అమ్మ—తమ్ముడు?"

"పిక్చరుకి వెడతారు. టికెట్సు రిజర్వ్ చేసాను."

"ఓ కె విత్ ఛీర్స్!"

ఫోను పెట్టేసింది లత.

సాయంకాలం ఏడుగంటలకి లత యింట్లో....

"రా శర్మా!"

"ఏమిటలా దల్‌గా ఉన్నావ్? తెల్ల చీరకట్టి, సిగలో తెల్లగులాబీ ముడిచి, రాజహంసలా ఎదురు చూస్తా వను కుంటే ..!"

"నే నెంత బాధపడుతున్నానో తెలిస్తే యిలా మాట్లాడవ్!"

"కాలాన్ని జారవిడుచుకుంటూ, ఒకరి మీద ఒకరం జాలిపడ్డం నా మతం కాదు!"

"విదులు!"

"విదలమని చెప్పడానికేనా పిలిచింది? కమాన్, లెటజ్ ఎంజాయ్! ఇంద..."

"టీచర్స్ విస్కీ! ఎక్కడిది?"

"మేనేజ్ చేసా. ఛెక్ దిస్ ఏసియా 72!"

"వాట్ కెనై ఎక్స్ఛేంజ్ ఫర్ దిస్ స్టఫ్?"

"ఆల్ దట్, ఎ మిస్ కెన్!"

o o o

"దసరా బుల్లోడు వెలిగిపోయే బాబు ఇలా పొళ్ళు కుదరని మతాబాలా వెల వెల పోతున్నాడేం?"

"రండి! ఉపమా శాస్త్రిగారూ!"

"నా కోసం కబురంపేరట? ఏదో సావెం జెప్పినట్టు?"

"దేవుడు, జ్యోతిషుడు· కావలసింది,

జాతకం తలక్రిందు లయినప్పుడేగా?"

"మీ జాతకానికేం? దివ్యం! శుక్ర మహర్దశ!"

"శుక్రుడు, శని అంటూ నన్ను హడలగొట్టకండి. అసలే గుండె దడగ ఉంటూంది వీడి మొహానికి పెళ్ళి యోగం వుందా లేదా?"

"ఆహా! ఎన్ని అదృష్టాలు పట్టాయి? పెద్ద చదువు, మంచి ఉద్యోగం, స్వగృహం, యింత ఆస్తి! బంగారం లాంటి పెళ్ళి కొ...కొ...కొడుకే! పెళ్ళి తండ్రి!....కొంచెం చిల్లర ... అల్లరి వ్యవహారం జరిపినట్లు తోస్తుంది. అదేం పెద్ద బాధించదనుకోండి!"

"చిల్లరేం ఖర్మ? టోకు లెఖ్ఖనే కాని, నే నడిగిన దానికి జవాబు చెప్పారు కాదు,"

"ఆ! అదే .... చూస్తున్నాను. ఆ! అదిగో....గతంలో .... అదే ఆరంభంలో, ఫెడీ చెడీ మనుకన్న వ్యవహారం తిరగతోడితే సానుకూలం అయ్యేలా వుంది!"

"అంతే నంటారా? నా కిష్టంలేదే?"

"మీ యిష్టం ఎవడికా్కవాలి? ఇందులో అలాగే రాసిపెట్టివుంటే! అదీ కాక "

"కాక?"

"ఆ అమ్మాయీ, యింకా అవివాహిత గానే ఉందని తమరోసారి చెప్పినట్లు గుర్తు? కారణం?"

"నే నంటే యిష్టం కనుక మంచి సంబంధాలు రెండు వచ్చినా, నాకోసం వదులుకుంది. ఇప్పుడు తనకీ వయసు దాటింది,"

"అవునా మరి? అటువంటప్పుడు మీ యిద్దరూ పెళ్లాడ్డవేఁ సబబు. మీకా అమ్మాయి తప్పదనే తోస్తూంది. ఒకవేళ అది అవకపోతే మరి యింకా సావకాశం లేదు!"

"అంతే నంటారా?"

"అంతే! దీనికి జాతకం అక్కర్లేదు! సి. యస్. ని బట్టి చెప్పొచ్చు!"

"అంటే?"

"కామన్ సెన్సు!"

"నాన్ సెన్సు!"

o o o

తప్పనిసరి అయిపోయి, రామశర్మ సీతదగ్గరకు వచ్చి, సీతతో అంటాడు

"సీతా! నిన్ను పెళ్ళిచేసుకుందుకు నిర్ణయించుకున్నాను!"

"అలా కూర్చో! ఇప్పుడు నీ వయసెంత?"

"ముప్ఫై ఎనిమిది,"

"నా వయసు నీకు తెలుసు. ఇప్పుడు నువ్వు నన్ను పెళ్లాడ్డం ఎందుకు?"

"అదేవిటి? మనిషికి పెళ్ళి ఎంత ముఖ్యం?"

"ఎంత త్వరగా గుర్తించావ్! ఒరే! మావయ్యా! నువ్వు కొత్తగ యిప్పుడు పెళ్లాడేది ఏమిటిరా? మన పెళ్ళి ఎప్పుడో జరిగిపోయింది. తాతయ్య కన్నుమూస్తూ ఆశీర్వదించి నప్పుడు అయిపోయింది. నువ్వు కాలేజీలో చదువుతున్నప్పుడు నేను ఓణీలు కడుతున్నప్పుడు అయిపోయింది. నీకూ నాకూ అడ్డు ఏముంది? చవితి చంద్రుణ్ణి ఎన్నిసార్లు సముద్ర తీరంలో మనం చూడలేదు? ఇసుకలో ఎన్నిమైళ్ళు కలిసి నడవలేదు? పాపం,

ఎన్ని జంటలు మన జంటను చూసి కుళ్ళి ఏడవలేదు? వాళ్ళంతా మనల్ని నూతన దంపతు లనుకునేవారు!"

"ఇప్పుడా గతం ఎందుకు?"

"అవును! గతంలోని గోతులు నువ్వు చూడలేవు. అమాయకంగ నీ కబుర్లకి మోసపోయి, ఆపైన నీ రూపం తెలుసుకుని జాగ్రత్త పడ్డాను. కనుక సరిపోయింది!"

"ఏమిటి నా రూపం?"

"ఎందు కడుగుతావు? నువ్వు యింత చదివీ ఏం ప్రయోజనం? మానవతా దృష్టిలేని శుద్ధ స్వార్థపరుడివి. అహంభావం తప్ప మరేం లేని మగాడివి. నేను మగాడిని అన్న "మగాడిమానియా" నీకు పూర్తిగ ఉంది. ఏ మాత్రం చదువుకున్నఆడపిల్ల ఈభావాలు సహించదు!"

"నువ్వు గ్రాడ్యుఏషన్ కూడ చేసావు!"

"ఎత్తి పొడవకు! ఐ హేట్ యువర్ మెగాలొమానియా?"

"నా షరతులు మరచిపోలేవనుకుంటాను!"

"లేదు! ఎప్పుడూ మరచిపోను! నీ ఎక్కువతనం చూపడానికి ప్రయత్నించావు! ఇప్పుడు నా ప్రశ్నలకు జవాబు చెప్పు!"

"నీ పెద్దన్న ఏం చేస్తున్నాడు?"

"సినీమా హాలులో గేటు కీపరు"

"రెండో అన్న?"

"ప్రెస్సులో పుస్తకాలు కుడతాడు!"

"నువ్వు?"

"లెక్చరర్!"

"ఎలా అయావు?"

"అదంతా ఎత్తకు!"

"ఎందుచేత? హోటల్లో విస్తళ్ళు ఎత్తాల్సిన నిన్ను లెక్చరరుగ చేసింది, నా తల్లి ఆస్తి!! అది మరచిపోయి, నీ కుళ్ళు భావాలుతో నాకు పెరమ్సు డిక్టేట్ చేద్దామని చూసావు! నీకూ నాకూ తేడా ఏమిటి? నువ్వు ప్రయివేటు కాలేజీలో లెక్చరరు వయితే, నేను గవర్నమెంటు మ్యూజిక్ కాలేజీలో లెక్చరర్ని!"

"మన హోదాలు పెళ్లికంత ముఖ్యమా?"

"అవి, ఈనాడు అంటున్నావు! నీ మూలాన నేనెంత నష్టపోయానో ఎరుగుదువా?

"మన పెళ్ళికి వయసు అడ్డా?"

"వయసు తక్కువ దేం కాదు. ట్వెంటీ టు థర్టీ కాక్ అండ్ హెన్! థర్టీ టూ పార్టీ నౌ అండ్ దెన్! ఆఫ్టర్ పార్టీ హూ నోస్ వెన్! వరో రెండేళ్ళలో నీకు చత్వారం వస్తుంది!"

"అందుకైనా, యోగం పెళ్ళాడాలి!"

"అది నీ అభిప్రాయం!"

"నీది కాదా?"

"కాదు! ఎప్పటికీ కాదు? నీ వంటి అవగుణాల పోగు నకొద్దు!"

"కొత్త మాటలు వాడుతున్నావు!"

"ఉత్తమాట కాదు, ఉన్న మాటే! విన్నమాటే!"

"ఏమిటా ఉన్నది, విన్నది?"

"ఉద్రేకపడకు! విను. లత యిప్పుడీ వూళ్లో ఉంటోంది! మొన్న నా ప్రోగ్రాంకి వచ్చింది, తన బాస్‌తో! అతను బెంగాలీ, నవీన్ ఛటర్జీ! నా ప్రోగ్రామే కాదు, నేనూ నచ్చా. త్వరలో సీతా ఛటర్జీ కాబోతున్నా!"

"తల తిరుగుతూంది! తల....తల.... లత....లత...."

ఫిల్మోత్సవ్ - 78 : ఒక సమాలోచన

ఇటీవల మద్రాసులో జరిగిన మూడవ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం సంచలనంకంటే, గందరగోళం ఎక్కువగా కలిగించిందని చెప్పవలసి వుంటుంది. రెండు వారాలపాటు ఈ ఉత్సవ సందర్భంగా ఒక అరడజన్ సినిమా హాళ్ళలో అహో రాత్రాలు 70 విదేశ సినిమా ప్రదర్శనలు జరిగాయి. ఇవి 150 ఫిల్ముల నుంచి ఎన్నిక చేసినవట. 23 దేశాలు నిర్మించినవి. ఇవికాక కొల్లలుగా భారతీయ ఫిల్ములు విదేశాల వారికోసం ప్రత్యేకంగా ప్రదర్శింపబడ్డాయి. వీటిలో 'తరం మారింది', 'ఒక వూరి కథ', 'చిలకమ్మ చెప్పింది' అన్న తెలుగు చిత్రాలు కూడా ఉన్నాయి.

30 దేశాలనుంచి 63మంది ప్రతినిధులు వచ్చారు. భారతీయ ప్రతినిధులు 152 మంది, పత్రికా విలేకరులు 250మంది వచ్చారు.

ఉత్సవంలో ప్రదర్శింపబడిన మన దేశపు కొన్ని చిత్రాలను-వీటిలో కొన్ని తెలుగు చిత్రాలూ వున్నాయి-విదేశాల ప్రదర్శకులు కొన్నారు. బేరసారాలింకా సాగుతున్నాయి. వాణిజ్యరీత్యానే కాకుండా, సాంస్కృతిక అదానప్రదానాల దృష్ట్యా కూడా, యిది యీ ఉత్సవం చేసిన ఒక మేలు.

ఫిల్ము నిర్మాణానికి సంబంధించిన వివిధ సమస్యలపై జరిగిన సదస్సులలో భారతీయ, విదేశీయ ప్రముఖులు పాల్గొని తమ అనుభవాలను, అభిప్రాయాలను తెలియజేసారు.

వ్యాపార లాభాలు తెచ్చిపెట్టని ఆర్ట్ ఫిలిమ్స్ పంపిణీకి ఒక సంస్థను స్థాపిస్తామని కర్ణాటకరాష్ట్రానికి చెందిన ఒకరు, యీ ఉత్సవంలో ప్రకటించడం సంతోషించవలసిన సంగతి. ఇది జరిగినట్టయితే, భారతీయ చలనచిత్ర రంగంలోని కాలుష్యం కొంతవరకైనా తగ్గే అవకాశం వుంటుంది.

ఈ ఉత్సవం జరుగుతూ వున్నప్పుడు వివిధ సందర్భాలలో తమిళనాడు ముఖ్యమంత్రి—యీయన భారీ ఎత్తు నటుడన్నది చెప్పనక్కరలేదు—కేంద్ర రేడియో, సమాచా రమంత్రి, ఉపరాష్ట్రపతి, తమిళనాడు గవర్నరూ మొదలైనవారు చలన చిత్ర నిర్మాతల సాంఘిక బాధ్యతను మరీమరీ నొక్కి చెప్పడం, ప్రస్తుతం ఆ బాధ్యత విస్మరింపబడుతూ వున్న దనడానికి దాఖలాగా వుంది.

చాలా పెద్దప్రమాణంలో యింత పెద్దసంఖ్యలో జరిగిన ఫిల్ము ప్రదర్శనల బాగోగులను వివరించడం తేలికకాదు కాని, స్థూలంగా అయినా పాఠకులు, ప్రేక్షకులు గమనించవలసిన విశేషాలు కొన్ని వున్నాయి.

ఎన్నో భారతీయ చిత్రాలతోపాటుగా 70 విదేశీ చిత్రాలు ఒకేసారి మద్రాసు నగరం మీదికి ఉప్పెనలాగా వచ్చిపడడం వల్ల, రకరకాల కుతూహలాలతో సినీమా లను చూసే ప్రేక్షకులకు ఉక్కిరిబిక్కిరి అయినంత పనయ్యింది పబ్లిసిటీ సక్ర మంగా జరక్కపోవడంవల్ల, ప్రేక్షకుడికి ప్రదర్శించబడే చిత్రాల వైనం తెలియక, తన అభిరుచికితగ్గ చిత్రమేదో, కానిదేదో తెలుసుకోవడం కష్టమైపోయింది.

కళాత్మకంగానూ, ప్రయోజనాత్మకంగానూ వుండే ఉన్నతప్రమాణాల చిత్రా లేవో తెలుసుకోవడానికి కొద్దిమంది యిబ్బంది పడితే; కామక్రీడల్ని తెరమీదనైనా తనివితీరా చూసి తరిద్దామని ఉవ్విళ్ళూరుతూ, వాటిని పసికట్టడానికి యిబ్బంది పడ్డ జిజ్ఞాసులు అనేకులు. చివరికి ఒకానొక చిత్రం రసవత్తరమైన సెక్సు చిత్రమని శోధించి తెలుసుకొని తండోపతండాలుగా దాన్ని ప్రదర్శించే హాలు మీద ప్రేక్ష మహాశయులు పడడం, ఆ వీధిలో రాకపోకలు స్తంభించిపోయే పరిస్థితి ఏర్పడడం, పోలీసులు వీరిని చెదరగొట్టేందుకు బాష్పవాయు ప్రయోగం చేయవలసి రావడం

సమాజం పట్ల సారస్వతానికి విముఖత లేదు

కన్నడ అభ్యుదయ రచయితల హెచ్చరిక

జనవరి 28,28 తేదీలలో మహాలింగ పూరులో జరిగిన ప్రగతిపంథా [కర్ణాటక అభ్యుదయ రచయితల సంఘం] తృతీయ మహాసభ, కన్నడ సాహిత్యంలో తల ఎత్తుతోన్న వైయక్తిక ధోరణులను, సారస్వతాన్ని సమాజం నుండి వేరుచేసే ప్రయత్నాలను తీవ్రంగా నిరసించింది. రాష్ట్రం నలుమూలలనుండివచ్చిన చాలా మందిఅభ్యుదయరచయితలు, మేధావులు పాల్గొన్న యీ మహాసభకు మైసూరు విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ హెచ్, ఎం. నాయక్ అధ్యక్షత వహిం చారు.

'వ్యక్తి స్వేచ్ఛ' పేరిట కొందరు రచయితలు తమ సామాజిక బాధ్యతను విస్మరిస్తున్నారనీ, యీ విధంగా వీరు యిప్పటి దోపిడీ సమాజాన్ని ఎదుర్కొ నకపోవటమేకాక, అది కొనసాగేందుకు తోడ్పడుతున్నారనీ డాక్టర్ జి. రాధాకృష్ణ తన ప్రసంగంలో తెలిపారు.

మహాసభ జరిగిన రెండు రోజులలో సాహిత్య చర్చలు, కవితా గోష్ఠులు జరి గాయి. అభ్యుదయ సాహిత్య సమస్యలు చర్చించబడ్డాయి. ప్రగతి పంథాకు కొత్త ప్రణాళిక ఆమోదించబడింది. ప్రొఫెసర్ కె. వి. రాజగోపాల్ అధ్యక్షుడుగాను, ప్రొఫెసర్ పి.వి.వజ్రమట్టి ప్రధానకార్య దర్శిగానూ, ఇరవై ముగ్గురితో కార్య వర్గం ఎన్నుకోబడింది. చరిత్ర గ్రంథాల పైని యిటీవల జరిగిన దాడిని, ఉత్తర ప్రదేశ్ ఉపాధ్యాయుల సమ్మె అణచి వేతనూ నిరసిస్తూ తీర్మానాలు ఆమోదింప బడ్డాయి.

యీ దేశంలో అభిరుచులు ఎటువంటివి ఏర్పడి వున్నవో తెలుపుతాయి. ఈ విధంగా కొందరికి ఆనందబాష్పాలు కార్చే సదవకాశం కలగకుండా పోయింది.

ఈ ఉత్సవం ఏర్పాటు, నిర్వహణ, దానిలో ప్రదర్శించే చిత్రాల ఎంపిక సవ్యమైన క్రమపద్ధతిలో జరిగివుంటే ఎంతో ప్రయోజనం కలిగివుండేది. మానసికారోగ్యం, అభిరుచులు పాడుచేస్తూ, ఏకాగ్రచిత్తంతో వ్యాపార లాభాల వేటలో మునిగి తేలుతోన్న యీ దేశపు సినీమా రంగం మీద, దాని ప్రభావం కొంతగానయినా పడి వుండేది; ఉన్నత ప్రమాణాలున్నవీ, సాంఘిక ప్రయోజనం వున్నవీ చిత్రాలు ఎంపిక చేయడం జరిగివుండేది ఉత్సవం సంచలనం కలిగించడంకంటే గందరగోళమే ఎక్కువ కలిగించడంవల్ల, ఎంపిక కూడా గందరగోళంగా జరిగిందన్న విమర్శలు ధాటుగానే వచ్చాయి 150 చిత్రాలనుంచి ఎంచిన 70 చిత్రాలలో ఎంచ కూడనివి చాలా వున్నాయనీ, తిరస్కరించిన వాటిలో కొన్ని స్వీకరించవలసినవి వున్నాయనీ ఫిర్యాదులు వచ్చాయి.

ఈ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం భారతీయ చలన చిత్ర కళమీద (దురదృష్టవశాత్తు ప్రస్తుతం ఇది కళగాకాక, లాభాలమీదఏకాగ్రదృష్టిగల పరిశ్రమగా వుంది) ఎటువంటి సత్ప్రభావంగాని, (ప్రదర్శించిన70 చిత్రాలలో దుష్ప్రభావం కలిగించగలవి ఎక్కువగానే ఉండడం వల్ల) దుష్ప్రభావంగాని కలిగిస్తుందన్నది ఖండితంగా చెప్పడానికి పరిస్థితులు లేవు

అయితే నల్ల ధనానికి, పంపిణీదారుల, నిర్మాతల, అగ్రనటుల చెప్పుచేతల్లో పడి వెర్రి కళలు వేస్తోన్న నేటి భారతీయ చలనచిత్ర కళను విముక్తి చేయడానికి కొద్దిగానయినా ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలుగు చలనచిత్ర నిర్మాణంలోనూ యీ ప్రయత్నం ఇటీవలనే మొదలవడం సంతోషించవలసిన సంగతి.

సప్త వ్యసనాలకు, అరిషడ్వర్గాలకూ వశమైపోయి, కళాసాధనాలన్నిట్లోనూ బృహత్తర శక్తిగల యీ కళాసాధనం ఘోరంగా దుర్వినియోగం అవుతూ వుంటే సహించలేని, సాంఘిక బాధ్యతను గుర్తించిన, ఉత్తమాభిరుచుల్నీ, ఉన్నత ప్రమాణాల్నీ పెంపొందించడానికి పూనుకున్నవారు కొద్దిమంది, ప్రబలంగావున్న ఈ క్షీణ ధోరణిని సవాలు చేస్తున్నారు. ఇటువంటివారు నిర్మించిన చిత్రాలు అన్నీ కాకపోయినా, కొన్నయినా లాభాలు తేకపోయినా నష్టం కలిగించడం లేదు, అవి పై దేశాలలో మన సినీరంగానికి పేరు ప్రతిష్ఠలు ఆర్జిస్తున్నాయి.

కాని సాంఘిక బాధ్యతా రహితమైన, నైతిక కాలుష్యం కలిగించే చిత్రాలదే పై స్థాయిగా వుంది. ఉత్తమ అభిరుచులతోనూ, ఉన్నత ప్రమాణాలతోనూ వున్నవి యిప్పటి మలిన మహాసముద్రంలో ఓన్న చిన్న లంకలుగా మాత్రమే ఉన్నాయి.

సినీమా వ్యాపారస్తులు పూర్తిగా ధ్వంసంచేసిన ప్రేక్షకుల అభిరుచిని పెంపొందించేందుకు ఫిల్మ్‌సొసైటీలు తోడ్పడతాయి. ఆంధ్రప్రదేశ్‌లో పది-పదిహేను నగరాలలో అవి యీ లక్ష్య సాధనకోసం కృషి చేస్తున్నాయి. ఐదు కోట్ల జనాభా వున్న రాష్ట్రంలో ఇవి చాలవు. ఈ ఉద్యమం ఇంకా విస్తరించవలసివుంది. అంతవరకూ వ్యాపార లాభాల చిత్రాల విజృంభణ సాగుతూనే వుంటుంది: అసహ్యించుకొని తిరస్కరించ వలసిన చిత్రాల్ని అంతవరకూ ప్రేక్షకులు ఎగబడిచూస్తునే ఉంటారు.

ఈ స్థితిని మార్చేయింకో పూనికలో విజయవాడలో 10 రోజులపాటు జరిగిన ఫిల్మ్‌ఎప్రీసియేషన్ కోర్సుకు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుండి విద్యార్థులు హాజరవడం, ఆ నగరంలోనే ఫిల్మ్ అధ్యయన గ్రంథాలయం ప్రారంభం కావడం శుభసూచకాలు, తప్పక జరగవలసిన పరివర్తనకు దోహదకారులు.

ఈ దేశంలో హిందీ తరవాత పెద్ద సంఖ్యలో తెలుగులో ఫిల్మ్ నిర్మాణం జరుగుతున్నది. ఒకప్పుడు దక్షిణాదిని తెలుగు చిత్రాలు మార్గదర్శకాలుగా వుండేవి. ఇప్పుడు మధుర స్మృతిగా మాత్రమే మిగిలింది. తలకిందులైన యీ పరిస్థితినీ తెలుగు చలన చిత్ర కళకు తలవొంపులు ఏ కారణాలవల్ల, ఏ కారకులవల్ల వచ్చినదీ యీ రంగానికి చెందినవారంతా, వారికంటె యీ రంగాన్ని పోషిస్తున్న ప్రేక్షకులంతా చిత్తశుద్ధితో ఆలోచించాలి.

రచయిత పరిపక్వత

విచారశీల సృజనాత్మక కృషి యావత్తు ప్రాతిపదికతో ఆత్మ కథాత్మకమే. మంచి విలువ గలదేదో వ్రాయదలచుకున్న రచయిత తన జీవితం నుండీ, అనుభవం నుంచీ తీసుకోవాలి. యువ రచయిత అనుభవం లేక కళాత్మక దృష్ట్యా మరీ నగ్నంగా జరిగింది జరిగినట్లు వ్రాసేస్తాడు. వాస్తవికతకూ యధార్థానికీగల సరిహద్దుల నాతడు సరిగా అర్థం చేసుకోడు. జరిగింది జరిగినట్లే వ్రాసేస్తాడు. కళ దృష్ట్యా అది తప్పు. వ్యభిచారిణి అయిన ఒక ఆందకత్తె 1907 లో కెంటకీ రాష్ట్రం నుంచి వచ్చిందని జ్ఞాపకం చెయ్యడం అనవసరం, ఆమె ఇదాహో నుంచి రావచ్చు. టెక్సాస్‌నుంచో, నావోస్కాటియా నుంచో రావచ్చు, అది ముఖ్యం కాదు. ఆ వ్యభిచారిణి స్వభావం, స్వరూపం సాధ్యమైనంత బాగా చెప్పాలి, అది ముఖ్యం. కాని యువ రచయిత యధార్థం నుంచీ, తన అనుభవ శూన్యత నుంచి బయట పడలేదు. అతనికి పరిపక్వత కలగలేదు. "ఆవిడ కెంటకి నుంచి వచ్చింది కదా. అల్లా వ్రాయడం తప్పు కాదు" అని వాదిస్తాడు.

థామస్ వుల్ఫ్

బెర్టోల్ట్ బ్రెహ్ట్ (1898-1956)

కాట్రగడ్డ గంగయ్య

విశ్వసాహిత్యంలో మరువరాని స్థానం సంపాదించుకున్న మహావ్యక్తులలో ఒకరు బెర్టోల్ట్ బ్రెహ్ట్—దాదాపు నాలుగు దశాబ్దాలపాటు జర్మన్ భాషలో ఆయన చేసిన రచనలు ప్రపంచం నలుమూలలా వివిధ భాషల్లోకి తర్జుమా అయ్యాయి. కోట్ల కొలది చదువరులను ఉత్తేజపరుస్తున్నాయి.

పద్యాలు, పాటలు, లిరిక్స్—బేలడ్స్, చిన్నకథలు, పెద్ద కథలు, నాటకాలు, వ్యాసాలూ యివన్నీ ఆయన రచనా వైవిధ్యానికీ, సృజనాశక్తికీ నిదర్శనాలు.

80 సంవత్సరాలక్రితం జర్మనీలోని ఆగ్స్‌బర్గ్ అనే పట్టణంలో 1898 ఫిబ్రవరి 10వ తేదీన ఒక సంపన్న కుటుంబంలో ఆయన జన్మించారు. 1956 ఆగస్టు 14న సోషలిస్టు జి.డి.ఆర్. రాజధాని బెర్లిన్ నగరంలో మరణించారు.

బ్రెహ్ట్ జీవించిన దాదాపు ఆరు దశాబ్దాలలో ప్రపంచ స్వరూపమే మారిపోయింది. లక్షలాది జర్మన్ ప్రజలనూ, కోట్లకొలది యితర దేశాల ప్రజలనూ పొట్టను పెట్టుకున్న రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి.

ప్రపంచ ప్రజల ఆశాజ్యోతిగా, యుద్ధంమీద, యుద్ధప్రేరేపకశక్తులైన సామ్రాజ్యవాద, గుత్తపెట్టుబడిదారీ విధానంమీద తీవ్రపోరాటం సాగించే శాంతి సేనాపతిగా, స్వాతంత్రోద్యమాలకు ధృవతారగా సోవియట్ యూనియన్ అక్టోబరు విప్లవ ఫలితంగా ఉద్భవించి, నానాటికీ బలవత్తరమై జర్మన్ ప్రజల పాలిట పెనుభూతమైన జర్మన్ సైనికతత్వానికి చావుదెబ్బ కొట్టింది. జర్మన్ గడ్డమీద జర్మన్

కొన్ని జీవిత విశేషాలు

భార్యతో పాటుగా 1948లో ప్రవాసం నుండి స్వదేశానికి తిరిగివచ్చి, సమూలంగా సర్వవిషయాలలో మారిపోయిన తూర్పు జర్మనీలో స్థిరపడేందుకు బ్రెహ్ట్ నిశ్చయించుకున్నారు. ఇదేకాక, కళలు వర్ధిల్లే పరిస్థితులు ఇక్కడ బాగా కనిపించాయి ఆయనకు. జర్మన్ ప్రజాస్వామిక రిపబ్లిక్ స్థాపన అయిన కొద్ది నెలలకే, బెర్లినెర్ ఎన్‌సెంబుల్-దీనినే 'బ్రెహ్ట్ నాటక సమాజ' మంటారు – 1949లో స్థాపించబడింది. కొద్ది కాలానికే యీ నాటక సమాజం ఆ దేశ సోషలిస్టు నాటక కళకు ప్రపంచ ప్రఖ్యాతిని ఆర్జించింది. జీవింతాంతం బ్రెహ్ట్ యీ నాటక సమాజానికి దర్శకుడు, ఆయన భార్య హెలెన్ వియ్‌గెల్ మానేజర్.

చరిత్రలో మొదటిసారిగా శాంతికాముకమైన, మానవతావాదానికి అంకితమైన సోషలిస్టు జి.డి.ఆర్. ఉద్భవించి, యూరప్‌లో శాంతి పరిరక్షణకు పెట్టని కోటగా నిలబడింది. ప్రపంచమంతటా వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటాలు చెలరేగాయి— ఇవన్నీ చరిత్రగతిని నిర్దేశించే శక్తి సామాన్య మానవునికి సంక్రమిస్తోందని నిరూపిస్తున్నాయి.

ఈ ముఖ్య పరిణామాల విషయంలో రచయితగా,వ్యక్తిగా బ్రెష్ట్ దృక్పథం ఏమిటి?

అన్నార్తుల ఆకలి ఘోష, దీనులూ, దరిద్రులు, దగాపడిన తమ్ములు పెట్టుబడిదారీ వ్యవస్థకు బలికావడం, సర్వత్రా అన్యాయాలు, అక్రమాలు రాజ్యమేలడం— వీటిని గురించి పట్టించుకోకుండా ఆత్మప్రసన్యాసం చేయలేదు బ్రెష్ట్. తాను వ్రాసే ప్రతి మాటా నవ ప్రపంచానికి నాందీవాచకంగా వుండాలని అహర్నిశలు కృషిచేశాడాయన.

1918లో "మృత సైనికుని గేయ గాథ"తో తన సృజనాత్మక కృషిని ప్రారంభించారాయన. కూలిపోతున్న తన సామ్రాజ్యాన్ని ఎలాగైనా రక్షించుకోవాలన్న ఆశతో జర్మన్ మిలిటరిజం, చివరకు చచ్చి, కుళ్ళి కంపుకొడుతున్న సైనికుడి శవానికి ఏదో విధంగా కాయకల్ప చికిత్సచేసి, రణరంగానికి అట్టహాసంతో, ఆడంబరంతో సాగనంపడానికి పడే తాపత్రయాన్నీ, కటికచీకటి కలవాటుపడి, "వీర" మరణంపై ప్రేరేపితమబడే సిపాయి అశక్తతను వ్యంగ్యంగా మనసును కలవరపరిచేటట్టు ఇందులో వర్ణించారు రచయిత.

ఏలినవారి నమ్మినబంటైన సిపాయినే అపహాస్యం చేసినందుకు ఆనాటి పాలకులు, వారి వారసులైన నాజీలు బ్రెష్ట్‌ను గర్హించారు. రూపుమాపాలనుకున్నారు.

ఆయన నాటకకర్త ; మాత్రమే కారు రంగస్థల దర్శకుడు, నూతన నాటక కళకు సిద్ధాంతకర్త కూడా. దేశ పునర్నిర్మాణానికి పూనుకొన్న తన ప్రేక్షకుల ఎదుట తన నాటకాలను ఆడించడం తన విధిగా ఆయన భావించేవారు. "ఒక యావత్తు తరం నటులూ తప్పుడు ప్రమాణాలు అనుకరిస్తున్నారు, తప్పుడు పద్ధతుల్లో శిక్షణ పొందారు" అని అప్పటి పరిస్థితిని గురించి బ్రెష్ట్ రాశారు. అంచేత నాటక ప్రదర్శనకు పనిచేసే వారందరికీ ఆయన శిక్షణ నిచ్చారు, వారితోబాటు తానూ నేర్చుకున్నారు.

రాజకీయ పాక్షికత, సాంఘిక సంబంధాల అవగాహన, విప్లవ దృక్పథం నాటకరంగం వల్లలభించే ఉత్తమోత్తమ విషయాలని ఆయన వివరించారు.

ఆయన చేసిన ప్రయోగాలు, ఆయన సిద్ధాంతాలు, ఆయన నాటకాలు, పద్ధతులు ప్రపంచమంతటా సంచలనం కలిగించాయి, పలు దేశాల నాటక కళను ప్రభావితం చేశాయి.

"ఈ దశాబ్దాల నాటక కళ ప్రజా

అయితే నాజీ హంతకుల యీ కుట్రను గ్రహించి హిట్లర్ రాజ్యాధికారాన్ని చేపట్టగానే, 1933లో బ్రెహ్ట్ జన్మభూమిని వదిలి విదేశాలకు వెళ్ళి, పదిహేనేండ్లపాటు తన రచనల ద్వారా నాజీలపైన, వారి మద్దత్తుదార్లపైన నిర్విరామంగా పోరాటం సాగించారు. ఆ విధంగా ఆయన తన రచనలద్వారా వివిధదేశాల ప్రజలు నాజీజం నిజస్వరూపాన్ని అర్థంచేసుకోడానికీ పోరాటానికి సిద్ధపడడానికీ దోహదం చేశారు. 1948లో బెర్లిన్‌కు తిరిగి వచ్చి అటు పశ్చిమ జర్మనీలోనూ, ఇటు తూర్పు జర్మనీలోనూ యుద్ధానంతరం వచ్చే మార్పులను ప్రత్యక్షంగా పరిశీలించి, తన జీవిత ధ్యేయం సఫలీకృతం కావడానికి అనుగుణమైన పరిస్థితులుగల సోషలిస్టు జి.డి.ఆర్.కి అంకితమయారీ మహారచయిత.

1956 మార్చిలో పోట్స్‌డాంలో అగ్రరాజ్యాలు జర్మన్ ప్రజల, యూరప్ ప్రజల మనుగడకై, శాంతిరక్షణకై చేసిన నిర్ణయాలను త్రోసిపుచ్చి పశ్చిమ జర్మన్ ప్రభుత్వం 18 ఏండ్లుపైబడిన ప్రతి యువకుడు నిర్బంధంగా సైనికశిక్షణ పొందాలని నిర్ణయించింది అప్పుడు పశ్చిమ జర్మన్ పార్లమెంటుకు వ్రాసిన బహిరంగ లేఖలో బ్రెహ్ట్ ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు:

"నా చిన్నతనంలో జర్మనీలో నిర్బంధ సైనిక శిక్షణ వుండేది. యుద్ధం ప్రారంభమైంది ఓటమితో అంతమయింది. నిర్బంధసైనిక శిక్షణ తొలగించబడింది. పెరిగి పెద్దవాడినయ్యాక మళ్లా చూశాను, యీ నిర్బంధ సైనికశిక్షణ ప్రవేశపెట్టబడడం. రెండో యుద్ధం ప్రారంభమైంది. అదివరకటి కన్నా పెద్ద యెత్తున, జర్మనీ మళ్ళీ ఓడిపోయింది యీ సారి మరింత చిత్తుగా. నిర్బంధ సైనిక శిక్షణ ప్రవేశపెట్టిన వారికి, దొరికిన మేరకు, ప్రపంచ న్యాయస్థానం మరణ శిక్ష విధించింది. ఇప్పుడు తల పండిపోతున్న యీ రోజుల్లో, నిర్బంధ సైనికశిక్షణ మరోమారు ప్రవేశపెడుతున్నారని వింటున్నాను.

బాహుళ్యానికి ఆనందం కలిగించాలి. జ్ఞానబోధ చేయాలి వారికి, వారిని ఉత్సాహపూరితుల్ని చేయాలి సోషలిజం నిర్మాణమయ్యేలాగా వాస్తవ స్థితిని చూపే నాటకాల్ని అది ప్రదర్శించాలి ఆ విధంగా అది సత్యానికి, మానవాళికి, సౌందర్యానికీ సేవచేయాలి."

హిట్లర్ అధికారం జర్మనీకి దాపురించినప్పుడు బ్రెహ్ట్ 1933 నుండి 1948 వరకూ అనేక దేశాల్లో జీవిస్తూ, ఎన్నో పద్యాలు వ్యాసాలేకాక, ఏడు పెద్ద నాటకాలు, ఐదు చిన్న నాటకాలూ నూతన జర్మనీ భావి నాటకరంగం కోసం రాశారు.

ఆయన 80వ జన్మదినోత్సవ సందర్భంగా బెర్లిన్‌కు అనేక సభలు, సదస్సులు, నాటక, టెలివిజన్ ప్రదర్శనలు జరుగుతున్నాయి. అవసాన దశలో బ్రెహ్ట్ నివసించిన గృహం బ్రెహ్ట్ పట్ల, ఆయన దేశమైన జర్మన్ ప్రజాస్వామిక రిపబ్లిక్‌పట్ల ఆసక్తివున్నవారికిఉపయోగపడే, చర్చావేదికగా రూపొందించబడింది.

"ఎవరికి వ్యతిరేకంగా మూడవ యుద్ధాన్ని ప్లాన్ చేస్తున్నారు? ఫ్రెంచి వారికి వ్యతిరేకంగానా? పోలిష్‌వారికి వ్యతిరేకంగానా? ఇంగ్లీషు వారికి వ్యతిరేకంగానా? రష్యన్లకు వ్యతిరేకంగానా? లేక జర్మన్లకు వ్యతిరేకంగానా? మనం అణుయుగంలో నివసిస్తున్నాం. 12 డివిజన్లు ఏ యుద్ధాన్ని గెలవలేవు. అయితే ఒక యుద్ధాన్ని ప్రారంభించగలవు అయినా ఒకసారి యుద్ధాన్ని ప్రారంభించిన తరువాత 12 డివిజన్లతోనే ఆగుతారా?"

ఈ బహిరంగ లేఖ ప్రచురితమైన కొద్దికాలానికే బ్రెహ్టా కన్నుమూశారు.

మానవాళిని రెండుసార్లు మారణహోమానికి గురికావించిన జర్మన్ మిలటరిజంకు వ్యతిరేకంగా, దాదాపు 40 సంవత్సరాలుపాటు ఆయన శక్తివంచన లేకుండా పోరాడినన యోధుడని చెప్పడానికి పై రెండు ఉదాహరణలు చాలు.

బ్రెహ్టా దాదాపు 40 నాటకాలు రచించారు. ప్రతి ఒక్కదానికీ ఒక విశిష్టత వుంది. వాటిలో కొన్నిటిని గురించి స్థూలంగా పరిశీలిద్దాము. కొందరు బ్రిటిష్ విమర్శకుల దృష్టిలో బ్రెహ్టా "ఇరవయ్యో శతాబ్దపు షేక్స్‌పియర్."

గోర్కీ 1907 లో రచించిన నవల "అమ్మ" మనకి సుపరిచితమే. 25 సంవత్సరాల తరవాత ఆ నవలకు నాటక రూపం కల్పిస్తూ, 1917 అక్టోబరు సోషలిస్టు విప్లవ విజయంతో స్వస్తి వాచకం చెప్పారు బ్రెహ్టా.

"రెక్కాడితేగాని డొక్కాడని మాకు అక్షరాలూ' గుణింతాలూ ఎందు"కని ప్రశ్నిస్తారు కూలీలు.

వారికి సమాధానం చెప్తాడు ఉపాధ్యాయుడు- "అ, ఆ,లు నేర్చుకోవాలి. అదే చాలదు, అయినా నేర్చుకోవాలి. మీరే రేపు నాయకత్వం వహించాలి. అందుకే మీరన్నీ తెలుసుకోవాలి, వంట ఇంటి కుందేలైన ఆడదీ చదువుకోవాలి. కారాగారంలో మ్రగ్గిపోతున్న మగవాడూ చదువుకోవాలి. ముగ్గుబుట్టలా తలనెరిసిన ముసలీ, నీవూ చదవాలి. తల దాచుకోడానికైనా వసతి లేని నిర్భాగ్యుడా, బడి ఎక్కడో వెదుక్కో. శీతాకాలపు చలికి గజగజ వణికే అభాగ్యజీవీ, విజ్ఞానాన్ని సంపాదించు. ఆకలితో అలమటించే అనాథుడా, అందుకో పుస్తకాన్ని. అదో ఆయుధం! మీరంతా నాయకత్వం వహించాలి!"

"చదువుకు ప్రశంస" అనే యీ పద్యాన్ని జి. డి. ఆర్. లో కళాకారులు అనేక సందర్భాలలో చదువుతారు. ఈ పద్య పఠనాన్ని విన్నప్పుడూ, రంగస్థలం మీద యీ దృశ్యాన్ని చూసినప్పుడూ ప్రేక్షకులు ఎంతో ఉత్తేజితులు కావడం నేను చూశాను.

అంతేకాకుండా యీ నాటకంలో శ్రామికులకు వర్గ చైతన్యం కల్గించడానికీ, తమకూ, విప్లవ పంథాకూ అంకితమైన పార్టీకీ ఉండే సంబంధాలను గురించీ, కమ్యూనిజం గురించీ, పార్టీ గురించీ, విప్లవకారుని గురించీ "ప్రశంసా పద్యాలు" ఉన్నాయి. ఒక్కొక్కటీ ఒక మణిపూస.

ప్రేక్షకులు (పాఠకులు) తాదాత్మ్యం చెందడం కాకుండా, వారిలో జిజ్ఞాసను ప్రేరేపించి, మెదడుకు మేతవేసి, జీవితంలోని వైరుధ్యాలను, వాటి సంఘర్షణలను బహుముఖంగా పరిశోధించి, ఆ వైరుధ్యాలను అధిగమించి, ప్రస్తుతాన్ని ఉజ్వల భవిష్యత్తుగా మార్చడానికి కృషి చేయడానికి అయత్తం చేయడమనేది బ్రెహ్ట్ రచనలలోని ప్రత్యేకతలలో ఒకటి.

మరొక గొప్పనాటకం "మదర్ కరేజ్". 1941 లో యుద్ధ కాలంలో వెలువడిన యీ రచనలో, 17 వ శతాబ్దంలో జర్మన్ గడ్డ మీద దాదాపు మూడు దశాబ్దాలపాటు జరిగిన యుద్ధం, సామాన్య ప్రజలు పడే కష్టాలు ప్రత్యక్ష మవుతాయి.

మొట్ట మొదటి సారిగా 1943 లో ప్రదర్శించబడిన "గలీలియో" అన్న నాటకానిది కూడా 17 వ శతాబ్దపు ఇతివృత్తమే. "భూమి చుట్టూ సూర్యుడు తిరగడం లేదు, సూర్యుని చుట్టూ భూమి తిరుగుతూంద"ని సిద్ధాంతీకరించిన యీ శాస్త్రవేత్తకూ, ఆనాటి మూఢ మతాధిపతులకూ జరిగిన సంఘర్షణ, చివరికి మరణానికి వెరచి అధికారం చెలాయించే నిరంకుశ శక్తులకు శాస్త్రవేత్త దాసోహం అవడం, అయినా రహస్యంగా ఆ పరిశోధనా ఫలితాలు దేశం నుంచి బయటికి తరలింపబడి ప్రజల పరం కావడం- యివీ ఇందులోని ముఖ్య సంఘటనలు. 1938 లో హాన్ అనే శాస్త్రవేత్త ఆణువును విచ్ఛిన్నం చేయడంలో కృతకృత్యుడయాడనే వార్త విన్న తరవాత, గలీలియో నాటక రచన ప్రారంభించారు, బ్రెహ్ట్. అజ్ఞాన తిమిరం నుండి ప్రజలు బయటపడి విజ్ఞానపు వెలుగు బాట తొక్కితే తమ అధికార సింహాసనాలు కూలిపోతాయనే భయంతో కాలగతిని వెనుకకు మళ్ళించ యత్నించే దుష్ట శక్తులకి నాటకం చెంప పెట్టు.

ఆ కాలంలోనే "సెషువాన్ నగరంలోని మంచి మహిళ" అనే మరో గొప్ప నాటకం కూడా వ్రాశారాయన. ప్రసిద్ధరచయిత కొండేపూడిలక్ష్మీనారాయణ గారు యీ నాటకాన్ని 1969 లో "మంచి మనిషి" అనే నాటకంగా సమకాలీన ఆంధ్ర వాతావరణానికి అనుగుణంగా రూపొందించారు. గుంటూరులోని భారత- జి. డి. ఆర్. మిత్రమండలి యీ తెలుగు రచనను ప్రచురించింది.

యూరప్‌లోనూ, యితర ప్రాంతాలలోనూ ప్రదర్శించబడి మన్ననలందుకున్న మరో నాటకం "కకేషియన్ చాక్ సర్కిల్". ఇది మన దేశంలో కూడా, ముఖ్యంగా బొంబాయి, కలకత్తా నగరాలలో, మరాఠీ బెంగాలీ భాషలలో ప్రదర్శించబడి జనాదరణ పొందింది. అంతే కాదు. జి. డి. ఆర్., భారతీయ రంగ స్థల నిపుణుల సహకారంతో యీ బ్రెహ్ట్ నాటకం మహారాష్ట్ర సాంప్రదాయాలకు అనుగుణ్యంగా వారి జానపద కళా రూపాలను ఇముడ్చుకుని మరాఠీ భాషలో రూపొందించ బడింది.

జి. డి. ఆర్. లో కూడా వారిచే ప్రదర్శించబడి అక్కడి ప్రేక్షకుల మన్ననలు పొందించి.

బ్రెహ్ట్ ఆలోచనా విధానాలపై మార్క్స్, లెనిన్ బోధనల ప్రభావం ఎంతో వుంది. "కమ్యూనిస్టు ప్రణాళిక"ను పద్యరూపంలో రచించాలని బ్రెహ్ట్ చాల కుతూహల పడ్డారు. ఈ కృషి పూర్తి కాకుండానే మరణించడం ఎంతో శోచనీయం.

"ప్రపంచాన్ని మార్చండి. అది ప్రపంచానికే ఎంతో అవసరం" అన్నారాయన. "ప్రపంచాన్ని వదిలి వెళ్ళేటప్పుడు నీ మట్టుకు నీవు మంచిగా వుండడమే కాదు, నీవు వదిలి వెళ్తున్నది ఒక మంచి ప్రపంచంగా ఉండేటట్లు చేయాలి" అని కూడా మరో సందర్భంలో అన్నారు.

ఆయన రచనలు, ఆయన జీవితం యీ రెండు సూక్తు లనుసరించి మలచుకున్న ధన్య జీవి ఆయన.

తన జీవిత కాలంలోనే ప్రపంచ ప్రజల మన్ననల నెంతగానో ఆయన పొందారు. 1955 లో మాస్కోలో "అంతర్జాతీయ లెనిన్ శాంతి బహుమతి"ని అందుకున్నారు.

ఆయన మరణించి దాదాపు 22 సంవత్సరాలు గడచిపోయాయి. ఆయన కలగన్న నవ ప్రపంచ వ్యవస్థ ఆవిర్భవించడానికి జరిగే విశ్వవ్యాపిత పోరాటంలో, ఆయన రచనలు పదునైన ఆయుధాలుగా ఉపయోగ పడుతున్నాయి.

అయ్యో పాపం

నికితా బగోస్లావ్‌స్కీ సోవియట్ వాగ్గేయ కారుల్లో చాలా పేరు పడ్డవాడు, చాల చిన్నతనంలోనే ఆయన సంగీత సామర్థ్యం ప్రశంస లందుకొంది. తన మొట్ట మొదటి గేయ రూపకం వ్రాసిన నాటికి ఆయన వయస్సు పధ్నాలుగేళ్ళు.

ఆ దేశంలో 16 ఏళ్ళలోపు వాళ్ళని సాయంకాలపు 'షో' కి రానివ్వరు. అందుచేత ఆ గేయ రూపక రచయితకి తన నాటకం ప్రదర్శన చూడడానికి వీల్లేకపోయింది.

*

★ బ్రెఖ్ట్ కవితలు ★

సూక్తులు

ఉన్నదానితో తృప్తి పడమంటారు
విందు లారగించే వారు;
పన్నులు వసూలు చేసుకునే వారు
త్యాగాలు చెయ్యమని
ఎలుగెత్తి చెపుతారు:
కడుపు నిండినవాళ్ళు
ఆకలి గొన్న వారికి
అరచేత స్వర్గం చూపుతారు;
దేశాన్ని గోతిలో దింపే వాళ్ళు
పరిపాలన
సామాన్యుల కలవి కాదంటారు;
శాంతిని గురించి నాయకులు చెప్పే
రంటే సాదా మనిషికి తెలుసు
యుద్ధం దగ్గర్లో వుందని;
నాయకులు యుద్ధాన్ని శపించారంటే
సైన్య సమీకరణ
మొదల య్యిందన్న మాటే.

పుస్తక దహనం

ప్రమాదకరమైన ప్రబోధాలున్న పుస్తకా లుండడం క్షేమంకాదని గ్రహించిన వారై

ప్రభుత్వం వారు ప్రతిచోటా పుస్తకాల్ని బళ్ళకెత్తించారు.

బహిరంగంగా వాటికి అగ్నిసంస్కారం జరిపించారు.

ప్రవాస శిక్ష ననుభవిస్తోన్న మహాకవి కిది తెలిసి

కోపంతో కంపించిపోయాడు, తన పుస్తకాలు వాటిలోలేనందుకు,

నిప్పులు కురిసే ఉత్తరంరాశాడు సర్కారుకు.

నన్నుకాల్చండి, నన్నూ కాల్చండి, నన్నిలా అవమాన పర్చకండి.

నన్నిలా ఒదిలి పెట్టకండి.

నా పుస్తకాల్లో నిజాన్నేచెపుతున్నానే ఎందుకి లా నన్ను జూటాకోర్ని చేసేస్తారు?

కాల్చెయ్యండి నన్ను
కాల్చెయ్యండి నన్ను–
మీకి ది నా ఆజ్ఞాపన.

కార్మికుని చరిత్ర జ్ఞానం

థేబెస్ రాజ్య సప్తద్వారాలు కట్టిం దెవరు?

రాజుల పేర్ల జాబితా నిచ్చాయి గ్రంథాలు. రాళ్ళెత్తింది రాజు లేనా?

ఎన్నిసార్లో నాశనమయ్యిందిబాబిలన్,
ప్రతిసారీ దాన్ని తిరిగి కట్టిందెవరు?

బంగారు కాంతులు చిమ్మే లిమా భవనాల్లో వాటిని కట్టిన వాళ్లున్నారా ఎక్కడేనా?

చైనా గోడ కట్టడం ముగించి తాపీ పనివాళ్ళు వెళ్ళిం దెక్కడికి?

రోమ్ సామ్రాజ్యంలో దండిగా నిండిన జయ స్తంభా లెత్తిందెవరు? గెల్చిన వాళ్ళు నిజంగా చక్రవర్తులేనా?

బైజాంటియం పాటలలో కెగ్గింది కదా, మరి దాని ఇళ్ళన్నీ భవంతులేనా?

గాథా ప్రశస్తికెక్కిన అట్లాంటిస్ సైతం—ప్రళయ సముద్రం పొంగిన నాటి రాత్రి మునిగిపోతూ కూడా పరితపించాడే బానిసలకోసం;

అలెగ్జాండర్ భారత దేశాన్ని జయిం

[illegible]

గాల్ ప్రజల్ని సీజర్ ఓడించాడు. అతని సేనలో వంటవాడేనా లేడంటారా?

స్పెయిన్ రాజు ఫిలిఫ్ తన ఓడలు నాశనమవుతోంటే ఘోరుమని ఏడ్చాడు. ఇంకెవరూ కన్నీళ్ళు కార్చనే లేదా?

ఫ్రెడరిక్ చక్రవర్తి యేడేళ్ళ యుద్ధంలో జయించాడు. అతనితోబాటు జయించిందెవరు?

ప్రతి పుట ఒక విజయం, విజయోత్సవం ఖర్చు పెట్టా లెవరివి?

పదేసేళ్ళ కొక మహానుభావుడు— సన్నాయి మేళానికి చెల్లింపు లెవరివి?

ఎన్నో విశేషాలు, ఎన్నో ప్రశ్నల పరంపరలు.

యజ్ఞఫలం

ఆ రోజు
రోజులన్నిటికీ రాజు
ఆ రోజు
రాలిపోయింది బూజు
నిజం తెలుసుకున్న జనం
భయం పోయి జవం పొంది
నిలిచి చేసింది రణం
టక్కరితనాన్ని ధిక్కరించి
బిక్క మొహాలు హూంకరించి
పంజా ఎత్తే సరికి
పుంజాలు తెంచుకుని ఉరికి
ఊరి పొలిమేరలకు పారి
పోయాయి తిరిగిరాకుండా మరి
కాని
యజ్ఞఫలం చేతికొచ్చే సరికి
వచ్చాయి నల్ల రాబందులు
నడినెత్తి మీదకి........

—పసుపులేటి రామారావు

రేపు కోసం

నిన్నేమో--
కుల మతాల కుళ్లతో కరుడుగట్టిన
'భూతకాలం'
'శూద్రుడా' అంటూ తరిమికొట్టింది.
నేడేమో--
వారి కొడుకు వర్తమానపు
'డబ్బు' గాడు
'ఛీ దరిద్రుడా' అంటూ చిత్రహింస
చేస్తున్నాడు !
మరి రేపు
వారి స్వార్థపు భవిష్యత్తు
బక్క చిక్కిన నా కొడుకును
బ్రతక నిస్తాడా? !
అందుకే ఆ రేపు కోసం
నేడు విప్లవిస్తా.
నా కొడుక్కి దారి వేస్తా.

—ప్రేమ్‌శిల

మెరవని చంద్రుడు

ఏ సీ గదిలో శయనించిన చంద్రుడు
జరీ చీర కట్టుకొచ్చిన
తారతో కులుకుతున్నాడు--
బారులో దూరిన మేఘం
మడిబట్ట కట్టుకొచ్చిన
ఎండమావితో విస్కీ సేవిస్తోంది.--
చంద్రుణ్ణి ఎంత సానబెట్టినా
మెరవడు
మేఘాన్ని ఎంత నానబెట్టినా
కురవదు-
చంద్రుణ్ణి చాకలి బండ మీద ఉతుకు
ఏమన్నా తెల్లబడతాడేమో చూడు-
మేఘాన్ని పళ్ల చక్రాల మధ్య
పిండు
ఏమన్నా నీటిబొట్టు రాలుస్తుందేమో
చూడు_

సామాజిక భావుకత కల భావకవి తిలక్

సొదుం రామ్మోహన్

చిన్న విషయానికి కూడా చలించిపోగల సుతిమెత్తని స్వభావాన్ని భావుకత అంటారు. ఇది కళాకారులకు తప్పనిసరిగా వుండాల్సిన గుణం. ప్రతి చిన్న సామాజిక సంఘటనకూ, తోటి మనిషి దుస్థితికీ తపించిపోయే తత్వాన్ని సామాజిక భావుకత అంటారు. భావుకత్వం వున్నంత మాత్రాన సామాజిక భావుకత్వం కూడా వుంటుందని చెప్పలేం. ఒక భావుకుడుంటాడు. గడ్డిపోచ కదలికలోని లయకు కూడా ప్రతిస్పందించి పోతాడు. కానీ అదే మనిషి అన్నంలేక ఆర్తనాదం చేసే బిచ్చగాని చూసి ఈగ వాలినట్లు కూడా అనుభూతి చెందక పోవచ్చు. ఈమని శంకర శాస్త్రి వీణా స్వరంవిజయరాఘవ రావు మురళీరవం విని ముగ్ధుడయ్యే ప్రతి భావుకుడూ పక్కింటి పెళ్ళికాని పడుచు పిల్ల గుండెలోతుల్లోని బాధాకర స్వనాలను విని కదలిపోతాడన్న గ్యారంటీ లేదు. భావుకతకూ, సామాజిక భావుకతకూ వున్న ఆ తేడాను గుర్తించాలి.

తోటి మనిషి స్థితికి ప్రతిస్పందించడాన్ని సామాజిక భావుకత అంటారు. సామాజిక సంఘటనలకు ప్రతిస్పందించడాన్ని కూడా సామాజిక భావుకత అంటారు.

సామాజిక భావుకత మహాకవి శ్రీశ్రీలో వున్నంతగా మరే యితర తెలుగు రచయితల్లోనూ లేదనిపిస్తుంది.

"శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు" అని "ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అని, "దీనుల మూగ వేదన కాలికింద నలిగిన చీమల కాళ్ళు విరిగిన చప్పుడు వినిపింపచేస్తాడు" అని, చలం అన్నప్పుడు, ఆయన ప్రస్తావిస్తున్నది, ఈ సామాజిక భావుకత గురించే. కాకపోతే ఈ పదం వాడలేదు ఆయన. అంతే.

"విశ్వవీణకు తంత్రినై మూర్ఛనలు పోతా"ననడం, "కడుపు దహించుకపోయే పడుపుకత్తె రాక్షసరతిలో అర్ధ నిమిలత నేత్రాల భయంకర బాధల పాటల పల్లవి" వినగలగడం, "మీ రక్తం కలగి కలగి, మీ నాడులు కదలి కదలి మీ ప్రేవులు కనలి కనలి ఏడవకండేడవకండి" అనగలగడం ఒక్క శ్రీశ్రీకే చెల్లు. దిక్కూ దివాణం లేక వీధుల్లో తిరిగే కుర్రవాణ్ని చూసి చలించి "అలకలన్నీ అట్టకట్టిన బొమికలన్నీ ప్రోవు పట్టిన, కాగితం వలె పలచబారిన వెరివాడా! కుర్రవాడా!" అనగలిగే సాంఘిక భావ సౌకుమార్యం ఒక్క శ్రీశ్రీకే వుంది.

తిలక్ కూడా గొప్పభావుకుడే. అయితే

శ్రీశ్రీతో పోలిస్తే ఆయనది చాలా తక్కువ సామాజిక భావుకత. భావకవు లకు భావుకత వున్నంతగా సామాజిక భావుకత ఉండదు. అది కూడా అంతే మోతాదులో వుంటే, కవిగా వారి తాత్వి కతలోనే మార్పు వస్తుంది. అంటే భావ కవి స్థానే అభ్యుదయ కవి చోటుచేసు కుంటాడు. తిలక్‌లో ఉన్న సుగుణం ఏమిటంటే, ఇతర ఏ భావకవిలోనూ లేని సామాజిక భావుకత ఆయనలో వుంది. అందుకు కొంత కారణం అతను అభ్యు దయ సాహిత్యోద్యమ సమకాలికుడు కావడం కావచ్చు. గొప్ప సామాజిక భావుకత పరవళ్ళు తొక్కే "భూలోకం" అనే గేయం 1945లోనూ, "శిథిపత్రం" అనే గేయం 1943లోనూ రాశాడు. అప్ప టికి దేశంలోనూ, రాష్ట్రంలోనూ అభ్యు దయ సాహిత్య ఉద్యమం రాజ్యం చేస్తు న్నది. అయితే 1960 దశకం నాటికి అభ్యుదయ సాహిత్య ఉద్యమం వూపిరి విడిచింది. కానీ 63, 64, 65, 66 సం వత్సరాలలో రాసిన కొన్ని గేయాల్లో సైతం గొప్ప సామాజిక భావుకత ఉంది. అప్పటికి అభ్యుదయ కవుల్లో అణగారి పోయినప్పటికీ, తిలక్‌లో మాత్రం సామా జిక భావుకత ఇంకా మిణుకు మిణుకు మంటూనే మిగిలింది. అందుకు నిదర్శన "వెళ్ళిపోండి వెళ్ళిపోండి", "నిన్నరాత్రి" వగైరా గేయాలు.

"అస్థిమూల పంజరాలు
ఆర్తరావ మందిరాలు
ఏలోకం తల్లీ ఇట
ఏవో బాష్ప జలాలు?
కూడులేని లోకం ఇది
గుండెలోతు శాపం ఇది
ఛఛచ్ఛటా శబ్దమేమి
చక్రాలకి రక్తమేమి
ఏం లోకం తల్లీ....
దారిపొడుగు జన శవాలు
జారిపడే చేయి కాలు
కాలు కడుపు ఇమ్మన్నది
గాజు మేడ లేదన్నది"

ఈ గేయం రాసింది నిజంగా తిలక్ యేనా? శ్రీశ్రీ కాదు కదా అనిపిస్తుంది అప్పుడప్పుడు. సామాజిక భావుకత మాత్రమే కాదు, ద్వాదశ మాత్రాగేయాన్ని నడిపించే ఆ వుద్రేకం, గమనం అన్నీ శ్రీశ్రీవే అనిపిస్తుంది. "కాలు కడుపు ఇమ్మన్నది గాజుమేడ లేదన్నది" అన్న పంక్తుల్లోని వర్గ ఘర్షణ స్వభావాన్ని చూసి, భావ కవిలోకి ఈ వర్గ ఘర్షణని దర్శించే శక్తి ఎలా జొరబడిందా అనిపి స్తుంది.

యుద్ధాల దారుణాలను, యుద్ధాల పర్యవ సానాలను తిలక్ లాగా బలంగా చెప్పిన కవి తెలుగులో మరొకడు లేడనిపి స్తుంది. యూరప్ కవుల మాట వేరు. రెండు ప్రపంచ యుద్ధాలను ఆ జాతి చవి చూచింది. కానీ ఇండియా సంగతి అలా కాదు. మన పై ప్రపంచయుద్ధాల ప్రత్యక్ష ప్రభావం అసలు లేదు. మనదేశంలో యుద్ధంపై రాసిన కవిత్వం చాలా స్వల్పంగా వుండడానికి అదే ప్రధాన కారణం కావచ్చు. గొప్ప సామాజిక భావుకత వుంటే తప్ప యుద్ధ పర్యవ సానాలను ప్రతిబింబించడం జరగదు.

"వెళ్ళిపోండి వెళ్ళిపోండి" అన్న గేయంలో తిలక్ ఇలా అంటాడు.

"అమ్మా వెళ్ళొండమ్మా
ఎందుకిలా వొంగి వొంగి కుంగి కుంగి
ఈ సమాధుల చుట్టూ వెతుక్కుంటూ
తిరుగుతారు

శవాలు మాట్లాడవు
సమాధులు చూపించవు
మృత్తిక గుర్తించదు
మిత్తికి దయవుండదు
మీ రోదన మీలోనే అణచుకుని
మీ కళ్ళను మీరే పొడుచుకుని
ఇలాగ యిలాగ ఈ పాముల
పుట్లమ్మట
ఈ మొండి చెట్లమ్మట ఈ కూలిన
గట్లమ్మట
వెళ్ళిపోండి వెళ్ళిపోండి వెళ్ళిపోండి."

మెగటన్ బాంబులు కల్పింపబోయే భయంకర పరిణామాన్ని ఊహించుకుని "లయ గీతం" ఖండికతో ఆయన యిలా అంటాడు.

"హిరోషిమా
నాగసాకీ
నగర స్మృతి చితాభస్మ
మెగిరి పడెను నా కన్నుల
జ్వాలత్కాష్ఠ
మిలా తలం
నిలుము నిలుము
నిముష మాత్ర
మఖిల ప్రజా మరణగాథ
నావిష్కరణము సేయకు
కలసి రాదు
కాలమింక

'ఆర్తగీతం' ఖండికలో తిలక్ సామాజిక భావుకత పరాకాష్ట చేరుకుంది. అందులో ఆయన ఇలా అంటాడు.

"నేను చూశాను నిజంగా
తల్లిలేక తండ్రిలేక తిండిలేక
ఏడుస్తూ ఏడుస్తూ
ముంజేతుల కన్నుల తుడుచుకుంటూ
మురికి కాలవ
పక్కనే నిద్రించిన మూడేళ్ళ
పసిబాలుణ్ణి."

ఒక్క నిరుపేద వున్నంతవరకు
ఒక్క మలినాశ్రు బిందు వొరిగినంత
వరకు
ఒక ప్రేగు ఆకలి కనలినంతవరకు...

తాను మానవునిగా శిరసెత్తుకు తిరగలేనంటాడు. ఈ నాగరికతా రణ్యవాసం భరించలేను అంటాడు ఆయన.

కవిగా తిలక్‌లో సామాజిక భావుకత ప్రధానమైందని కాదు కానీ, ఆయన ప్రధానంగా భావకవి అయినప్పటికీ, సామాజిక భావుకత ఆయనలో గణనీయంగా వున్నది అన్నదే నా భావం. భావకవులలో ఈ సామాజిక భావుకత అసలు వుండదు; లేదా అరుదు.

సవరణలు

గత సంచికలో 25వ పుటలో 17వ పంక్తి "....ఎక్కువ దార్లు పండడం మంచిది కదండీ" అని వుండాలి. ఇదే సంచికలోని "ఏతంతువు పాట్లు" అన్న మలయాళం కథను ఇంగ్లీషులోకి అనువదించినది శ్రీమతి బి. హృదయకుమారి.

"బందీ"

చామర్తి దుర్గాప్రసాద్

ఏ సుందర దృశ్యమూ నాకు
పూర్తిగా కనపడదు.
అడ్డంగా దిగవేసిన శూలాలు
నిలువునా ధ్వంసం చేస్తాయి
దగ్ధం చేస్తాయి.
చిరిగిపోయిన చొక్కాలాగా ఆ దృశ్యం-
చిందరవందర జనంలాగా అదృశ్యం —
ఆకుపచ్చని పర్వతాలు తృప్తిగా
నడుం వాల్చిన ఏనుగుల్లా
పడుకొన్నవి
నేలంతా పూల తివాచీ పరచుకున్నది
మధురస్వప్నాలలో తేలిపోతున్న
మబ్బు పింజలు-
ఎవరో పిల్లవాడు ఆకాశంలోంచి
మతాబా రాలుస్తున్నాడు.
పట్టపగలు దీపావళి
దద్దరిల్లే మోతలు
తటిల్లతలు
మండి చావని బొగ్గుల మరకతో
నల్లబడిన కెటిల్
జీవితంలాంటి బొచ్చె
చూరున గాలిన నీరు-టీ
చలిని చప్పరిస్తూ చూశాను -
సుందర దృశ్యాలను
దిగవేసిన వాన ధారల మధ్యనుంచీ,
మొహాన కప్పుకుపోయిన జుట్టులోంచి
చూస్తున్న కోతిలా.
నెలనెలా అందే మనిఆర్డర్లు
సుఖానికి రూపంగా స్నేహాల జోరు
చదువు అయిపోతే చాలు-
ఒడిలోవాలే ఉద్యోగం
అది కాగానే
ఒడిలో వాలే జీవిత భాగస్వామిగ
కమ్మని కల
ఎప్పుడూ నేను తలుచుకొనే అమ్మ
నన్ను తలుచుకొనే అమ్మ
ఎప్పుడో కాని కలవని అమ్మని
చివరిసారి—
కలిసిన రోజు-
ఎప్పటికీ నిలచిపోయేలా
నిలవాల్సిన కమ్మని కల
అందమైన రంగుల మధ్య
బాకుల్లా పోసిన నల్లటి ముద్దలు
అమ్మనీ-మరో పదిమంది
"అలాంటి వాళ్ళనీ"
నానుంచి విడదీస్తూ
నిలువునా దిగవేసిన శూలాలు.
ఎప్పుడో చిన్నప్పుడు
నెలకో రోజు నాకు ముస్తాబు
అందమైన అమ్మ ముఖంలో
చిందులు తొక్కే వెలుతురు
చేతిలో తాయిలం
అమ్మ చేతిలో చెయ్యి
నా తలని ఆదిగా నిమురుతున్న చేతులు
కటకటాల మధ్యనుంచి పప్పుల కోసం
చాపిన కోతి చేతులు
నావంక వెలుగును గుమ్మరిస్తూ
రెండు జ్యోతులు
చీకటి గుహలోంచి చూస్తున్న సింహం
కలల సముద్రంలో తేలిపోతున్న
నాకు
కనురెప్పల మధ్యనుంచీ కనపడే
అమ్మ ముఖంలానే

నా మీదికి వాలుతున్న ముఖం
అచ్చం అమ్మలానే!
అలాంటి ముద్దుకోసం తపన
అంతలో
నిలువునా దిగవేసిన శూలాలు
మా నాన్న ముఖాన్ని
నిండుగా నేనెన్నడూ చూడలేదు
ఎప్పుడూ నిలువు దారల మధ్యనుంచే
జ్ఞాపకాల గీతల సందులోంచే.
ఏ సుందర దృశ్యమూ నాకు
పూర్తిగా కనపడదు
నా మనస్సులో దిగవేసిన శూలాలు
విడదీస్తాయి నన్ను –
బయటి ప్రపంచం నుంచీ
ఆనందం నుంచీ.
చిత్రం:
నువ్వు రైల్లో కిటికీ బయటికి
చూసినప్పుడు
శూలాలుండవు – చిత్రం చిరిగిపోదు
అలానే
పలుగురి దుఃఖంలో గొంతు కలిపేందుకు
నన్నీ శూలాలు అడ్డుకోలేవు
ఆదుకోనేందుకు మాత్రమే
అడ్డుకుంటాయి
అందుకే
నేను బందీని
నా అసమర్థతకి–

సమీక్ష

"ప్రాణం"

(కవితా సంపుటి)

రచయిత- అదృష్టదీపక్ ఆంధ్రప్రదేశ్ అరసం తూ. గో. జిల్లా శాఖ ప్రచురణ. వెల- రెండు రూపాయలు. ప్రతులకు-విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్ అని వ్రాయాలి.

ఈ కవి చాలా సుకుమారమైన భావనాశక్తి కలవాడు. "రాబోయే ఉదయాల హృదయాల్ని, రంగుల హరివిల్లులతో అలంకరించి, రోదనలూ వేదనలూ లేని, ఆగామి చరిత్ర అధ్యాయానికి, అటలు రాయండి" అని అశ్వాసిస్తున్నాడు. ఆత్మాశ్రయాలైనా ఇవి అన్నీ ప్రబోధాత్మక కవితలు.

సామాజిక సమస్యల ప్రతిబింబమే ఈయన కవితలకు శరీరం. "కండల్ని కరగదీసి, బండబారిన యజమాని గుండెల్లో ఆనందాన్నీ, వాడి నల్లగదుల్లో కరెన్సీ కాంతుల్నీ, పెంచుతున్న కావ్యాత్తులు వీళ్ళు" వంటి స్పందనతో కూడిన దర్శన ప్రతిభ,"జీవితం కేన్వాసు మీద, వర్తమానం కుంచెతో రచిస్తున్న రేపటి ఆలోచనా చిత్రం" వంటి అనుభయతాద్రూప్య ప్రధానమైన ఉక్తివైచిత్రి ఈయన కవితలకు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అశావాదమ్మే వీటికి ప్రాణం. పైగా రచనలో తొణికిసలాడుతున్న తెలుగుతనం వల్ల ఈ కవితలన్నిటిలో జీవకళ ఉట్టి పడుతున్నది.

అయినా కవిత్వం ఆవేశ ప్రధానమూ, ఆపాత మధురమూ అయితే చాలదు. కవిత్వానికి ఆలోచనను రగుల్కొలిపే గుణం పుష్కలంగా ఉండాలి. ఇది కవిత్వంలోని వ్యంగ్యత వల్ల కలుగుతుంది. శబ్ద చమత్కారాలు, భావ తీవ్రత మనస్సును రంజింప జేస్తాయి కాని ఆలోచనను రేకెత్తించవు, అందునా ఈ సంపుటిలోని 'కాంతి ఖడ్గం' 'సమర సంగీతం' వంటి ఖండికలు-కవి ఆత్మశక్తిని ప్రకటించేవి-ఇందులో అసలు చేరదగ్గవి కావు. వీటితోపాటు "తుక్కులు చింపిన ఎంగిలాకులా ఉంది జీవితం, అరిగిపోయిన గ్రాంఫోను రికార్డులా విసుగు పుట్టిస్తోంది" వంటి పాతబడిపోయిన ఉపమానాలను విడిచిపెడితే బాగుంటుంది. పాత భావాలు, ప్రముఖుల రచనలకు అనుసృతులు దొర్లకుండా జాగ్రత్త పడితే ఉక్తి వైచిత్రిలో ప్రత్యేకత, లోతైన భావుకత కలవాడు కనుక ఈ కవి ముందు ముందు ప్రామాణికమైన కవిత్వం వ్రాయగలడన్న ఆశను ఈ కవితా సంపుటి కలిగిస్తున్నది.

మోహన్ వేసిన ముఖచిత్రంతో దీని ముద్రణ, గెటప్ కూడా ప్రశంసనీయంగా ఉన్నాయి.

"వైజయంతి"
"పారిజాతం"

(గేయ కావ్యాలు)

రచయిత వై. సి. వి.రెడ్డి, మొదటి దాని వెల రూ. 2. రెండవది రు. 3-50 ప్రతులకు- వై. సి. వి. రెడ్డి 2-76 ఎ. నాగరాజు పేట, కడప.

'వైజయంతి' లయబద్ధమైన గేయాలలో, సుతిమెత్తని తెలుగులో రచింప

బడిన కావ్యం. కృతిభర్త పుట్టపర్తి నారాయణాచార్యుల వారి రచనను అనుకరించడం అడుగడుగునా గోచరిస్తుంది.

మను చరిత్రలోని ప్రవరుడు వరూధినిని తిరస్కరించి వెళ్ళిపోయాడన్న వ్యాజోక్తులతో ఆ ప్రదేశ సౌందర్యం, ఆమె పడిన వేదనల వర్ణనతో ఇందులోని మొదటి భాగం ముగుస్తుంది.

ద్వితీయ భాగం అంతా ప్రవరుని జవాబు మేధావివర్గం రాజులను ఆశ్రయించడం గురించి, సామాన్యులను నిర్లక్ష్యం చేయడం గురించి వివరించి "క్రొత్త యాలోచనల గొంతులను పిసికితిమి, ప్రాత యాలోచనల ప్రజలపై రుద్దితిమి, ప్రాజ్ఞబోధలను తప్పని చెప్పి ఖండించి చెడిపివది మందిగా చేరి చిడిమితిమి పో, అలస్యమయ్యె మోహావేశ గతి తెలియ గతిలేని సాహిత్యముల్, కృతక జీవిత సత్యముల్" అంటాడు, తాను హిమాలయ ప్రాంతాలకు వెళ్ళి దారి తప్పి అలసి సొలసినట్లు, ఒక యువతి తనకు సేవలుచేసి ఇంటికి పంపించినట్లు చెబుతాడు. ఆమెకు కృతజ్ఞతా బద్ధుడై ఆమె కటిబద్ధ కాంచిని కావాలని కోరుకుంటాడు, దోపిడీదారుల గుట్టు రట్టు చేయాలని యువతిను శాసిస్తాడు. పారమార్థిక దృష్టి చాలునంటాడు. చెప్ప దలచుకున్న దేమిటో తెలియదు.

'పారిజాతం' లోనూ ఈయన భాష అతి సుకుమారమైన శబ్ద సంఘటనతో మనోహరంగా వున్నది.

ఈ కావ్యంలో మొదట 32 పుటలలో పారిజాతాపహరణ కథ అంతా చెప్పి చివరకు ఇటువంటి కథలు చాలని, పేదలకు సాయ పడాలని కవి ఆదేశిస్తాడు. ఈ కథన శిల్పం క్రొత్తగా వున్నా దీని వల్ల ప్రయోజన మేమిటో తెలియదు. ఆంధ్రాభ్యుదయం, సందేశం, కడప గడపలు- వీటిలో విషయం పాతదైనా కూర్పు చాలా అందంగా వున్నది. పాఠకులను మంత్రముగ్ధంచేసే భాష ఈయన కవితకు జీవం. (మురళి)

'మార్పు కోసం'

(కథల సంకలనం)

సంకలన కర్తలు- ట్వంటీ ఫస్టు సెంచరీ రైటర్స్, విజయనగరం-531 202.

వెల ఐదు రూపాయలు.

వివిధ ప్రాంతాలకు చెందిన 21మంది రచనలు దీనిలో వున్నాయి. వీటిలో 20 కథలూ, రెండు గీతాలూ. ఈ ప్రచురణ కర్తలు మొత్తం ఎనిమిది పుస్తకాలు వేశారు. ఇది సరికొత్తది.

ఈ పుస్తకంలోని రచనలలో ఎక్కువ భాగం సంపుటం శీర్షికకు తగ్గట్టు, మార్పును కోరే రచనలు, అయితే కొన్ని కథలు, పీఠిక పెడసరం ధోరణిలో వున్నాయి-యితివృత్తాలేకాదు భాషకూడా. ఇది యిప్పటి సాహిత్య పద్ధతుల్లో ఒకటి కావొచ్చును. కాని యిదొక్కటే పద్ధతి కాదు. మంచి విషయాలు చెప్పదల్చుకున్నప్పుడు, వెకిలితనం కంటే మంచి పద్ధతిని రచయితలు ఎంచుకుంటే బాగుంటుంది. 'వార్ స్టోరీ' అన్నది వియత్నాం వీర సమరానికిఅపకీర్తి తెచ్చే ఉద్దేశ్యంతో రాసింది కావడం శోచనీయం.

లేఖలు

తెలుగులో తొలి (ఆధునిక) కథ

... (లలిత) విషయంలో మీరు రాసింది నిజమే అయినా తెలుగు చిన్న కథా సాహిత్యంలో అది మొదటిదే, భాష గ్రాంధికమే అయినా- మరి వేలూరివారి కథలూ, మరికొందరివీ గ్రాంధికాలే కదా! గురజాడ చిన్న కథకి యుగ నిర్మాత అన్నా వివాదం లేదు. కాని ఆయన ఆద్యుడు కాడు. చిన్న కథ లక్షణాలన్నీ 'లలిత'కి పడతాయి, గురజాడ లాగే సాంఖ్యాయన శర్మ కూడ తక్కువ కథలే రాశారు, చిన్న కథలని ఆయన ఆయనే నవలికలన్నారు. తరువాత నవలికలు అనే తన కథలు పుస్తకాలుగా ప్రచురించారు. ఈ విషయంలో వివరంగా రాస్తాను, అంతవరకు ఆగండి.

పురిపండా అప్పలస్వామి విశాఖపట్నం.

ం ం ం

గురజాడకు ముందు తెలుగులోని కథా సాహిత్యాన్ని పరిశీలించి తొలి తెలుగు కథకుడు గురజాడ అవునా, కాదా అన్న దాన్ని నిర్ణయించి-గురజాడ కథల అనుశీలన జరపాలి. ఆ మధ్య తొలి తెలుగు కథగూర్చి వాదోపవాదాలు జరిగాయి, సాంఖ్యాయన శర్మగారి 'లలిత' మొదటి తెలుగు కథానిక అని, శ్రీయుతులు నిడదవోలువారూ, పురిపండా వారూ అన్నారు. 'లలిత'ను సంపాదించి "ఆంధ్ర జ్యోతి" దిన పత్రికలో ప్రకటిస్తూ ఒక నోట్ వ్రాశాను. డాక్టరు పోరంకి దక్షిణా మూర్తిగారూ, శ్రీమధురాంతకం రాజారాం గారూ, శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారూ 'లలిత'తో కథానికా లక్షణాలు లేవని నాకు ఉత్తరాలువ్రాశారు.

సాంఖ్యాయన శర్మగారివే 'సారసిక' 'అపూర్వోపన్యాసములు" వగైరా కథలు 'కల్పలత'' అన్న పత్రికలో 1903 ఆ ప్రాంతాల్లో ప్రచురించబడ్డాయి. అవేకాక ఇంకా ఆ రోజుల్లో వచ్చిన 'షార్టు స్టోరీస్' పరిశీలించి 'దిద్దుబాటు' తొలి తెలుగు కథ అని నిర్ధారణ చేయవలసి వుంది.

1910కు ముందు వచ్చిన కథలు కొన్ని పరిశీలించాను. ఇంకా కొన్ని చూడాలి. రాయసం వెంకటశివుడు, భండారు అచ్చమాంబ, సాంఖ్యాయన శర్మగార్ల కథలు చూడాలి, ఈ కథలగూర్చి చెప్పి తర్వాత గురజాడ ఆధునిక కథానికకు ఆద్యుడన్న విషయాన్ని తేల్చాలి.

బి. స్వర్ణాంబ తిరుపతి

సమర్థవంతమైన వేదిక

'అభ్యుదయ' చక్కగా వుంది. సంతులిత సాహిత్య విమర్శలకు సమర్థవంతమైన వేదికగా రాణిస్తోంది, దీన్ని తీర్చి దిద్దుతున్న వారికి నా అభినందనలు అంద జేయండి ముందు ముందు ఇది మరింత పుష్టి చేకూర్చుకొని సమగ్రమైన సాహిత్య పత్రికగా రూపుగట్టుకుంటుందని నా విశ్వాసం పత్రికకు యీ బాలెన్సు చెడిపో కుండా ఉండాలని నా ఆశ. త్వరలో మీ పత్రికకు వ్యాసం పంపుతాను.

పోరంకి దక్షిణామూర్తి హైదరాబాద్.

రాతగిన మార్పులు

'అభ్యుదయ' ఫిబ్రవరి సంచికలోని "ఆధునిక జీవితం - రచన" అన్న

ప్రత్యేక వ్యాసం, యిప్పటి మన సంస్కారానికి మింగుడు పడడం కష్టం. సంఘం. దానిలోని మనుషులు అనేక విభాగాలుగా మారుతున్నారు. కాని ఈ మార్పులు ఏవి రాతగినవో, ఏవి రాతగనివో విచక్షణతో గ్రహించే శక్తి మనలో చాలా తక్కువ మోతాదులో వుండడం వల్ల గతకల రోడ్డుమీద బండిలాగా సంఘ జీవనం సాఫీగా సాగడం లేదు.

పరిమితంగా నయినా స్త్రీలకు స్వేచ్ఛ, విద్య లభించడమూ వారు, రానూ రానూ ఎక్కువగా పురుషులతో కలసి మెలసి చదువుకోడం, ఉద్యోగాలు చేయడమూ నేటి సంఘ జీవనంలో పరిపాటి అయ్యింది. ఇందువల్ల కలిగే పరిణామాలకు-గత కాలంలో గుంభనగా జరిగే స్త్రీ పురుష సంపర్కాన్ని సహిస్తూ, లేదా తామే స్వయాన చీకటి తప్పుల్లో పాల్గొంటూ వుండే నవనాగరిక పురుష పుంగవులు వర్తమాన జీవితంలో యింకా కుదుట పడకుండా వున్న స్త్రీ, పురుష సంబంధం గురించి, నాయనమ్మల్లా ఆలోచించడమూ, మాటలాడటమూ జరుగుతున్నది. పురుషాధిక్యత, పురుషాధీనురాలిగా స్త్రీ ఉనికి యింకా ప్రకోపించి వున్నందున యీ వ్యాసంలో చెప్పిన సంగతి పురుషుడి స్వార్థ బుద్ధికే కాదు పురుషుడి చేతికింది బ్రతుకుకు అలవాటు పడిపోయిన స్త్రీ బుద్ధికి కూడా మింగుడు పడవు.

టి. సత్యవతి — విశాఖపట్నం

దివినుండి భువికి

"ముక్తకాలు — ఉష ఆగమనం" అన్న గ్రంథ సమీక్షలో (ఫిబ్రవరి సంచిక) సమీక్షకుడు "చైతన్యం విరిసిన ఆత్మ రోదసిలో, భామతి ఉషస్సు అవతరిస్తూంది, సహామతి అగ్నిమూర్తి సూర్యునివలె ప్రసరించి పరివృతుడనై వున్నాను" వంటి భాగాలు ఉదాహరించి యివి "వచన గేయాలేనా" అని ప్రశ్నించారు. "పాత వాసన కొడుతున్న పద బంధాల నడుమ నలిగి నీరసపడింది" అని వ్యాఖ్యానించారు. నిజమే, అయితే సమీక్షకుని శైలికూడా వీటికి తీసిపోయేదేమీ కాదు, మచ్చుకు "కాలస్వరూపాన్ని గుర్తించినా భవిష్యాన్ని సవర్ణ ఖండంగా ఆశ్వాసించి వర్తమానాన్ని ఆగామియుగాను రూపంగా తీర్చిదిద్దాలన్న ఆశలన వీటిలో తొంగి చూస్తూనే వుంటుంది.

ఇటువంటి వాక్యాలు కొరుకుడు పడడానికి దంతపుష్టి అవసరం. ఇంకో మనవి. 'అభ్యుదయ'లో సోమసుందర్ గారి గీతాలు, వ్యాసాలూ తరచు వస్తున్నాయి. ఇటువంటి సాము గరిడీలు వాటిలోనూ కొల్లలు- కృష్ణశాస్త్రి గారే నయం. "దిగిరాము దిగిరాము దివినుండి భువికి" అంటూనే అయన దిగి వచ్చారు. కాని కొందరు భువికి దిగివచ్చేటట్టులేరు.

ఇదేకాదు-సోమసుందర్‌గారు చేయి తిరగని రచయితల్ని 'అర్భకు'లంటూ తీసిపారేశారు. సోమసుందర్ గారితో పాటుగా రచయితలంతా ఒకప్పుడు అర్భకులేనన్న చిన్న విషయం యీ పెద్ద రచయిత గారికి తెలియకపోవడం విడ్డూరంగా లేదా?

-కె. వి. రంగారావు — వరంగల్

గోష్ఠి

మార్చి 5 (ఆదివారం)
శ్రీరాచకొండ విశ్వనాథశాస్త్రి కథలు

పొట్టిశ్రీరాములు స్మారక మందిరం (లజ్)లో సాయంత్రం 6 గంటలకు

ఈ సంచికలో

Edited and Published By T. Venkataramiah, at 15, Arulammal Street Madras-600017 and Printed at Sri Venkateswara Printers, Madras-600021